ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 24 సెప్టెంబరు 2024

సొంత పార్టీ నేతలపై సుగవాసి ఫైర్

- సమావేశాలను అడ్డుకునే కుట్ర చేస్తున్నారు
- చంద్రన్న ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు
- తప్పు చేస్తే ప్రజలే నిలదీయాలి
- 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభల్లో సుగవాసి

ఒంటిమిట్ట/సుండుపల్లె, సెప్టెంబరు 23: రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట, సుండుపల్లె మండలాల్లో సోమవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభల్లో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం సొంత పార్టీకే చెందిన కీలక నాయకులపై శివాలెత్తిపోయారు. సుండుపల్లె మండలం సొంతంవారిపల్లి, ఒంటిమిట్ట కోదండ రామాలయం సమీపంలో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ రెండుచోట్లా పాల్గొన్న సుగవాసి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మండల అధికారులు అందరూ పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. అయితే రాజంపేట నియోజకవర్గంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి అధికారులు ఎవరూ రాకుండా.. కడప జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ భయపెట్టి అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహించే కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించడం బాధాకరమన్నారు. ఆ ఎమ్మెల్సీ కలెక్టర్ ద్వారా అధికారులను రానివ్వకుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో తాగు, సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాజంపేటలో అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవం చేసేందుకు వెళ్తే పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పోటీగా వచ్చారని విమర్శించారు. అంతేగాకుండా వైసీపీ నాయకులతో కలిసి గత ఎన్నికల్లో తన ఓటమికి కుట్ర చేశారని అన్నారు. ఎవరైతే ఎన్నికల్లో మోసం చేశారో ? ప్రతి ఒక్కరి పేరు, ఫోన్ నెంబర్‌తో సహా మంత్రి నారా లోకేశ్ దగ్గర ఉన్నాయన్నారు. స్వయంగా తనకు చూపించారన్నారు. 40 సంవత్సరాలుగా కష్టపడి సాధించుకున్న పేరు పోకుండా ప్రజల కోసం పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినా కొంతమంది హద్దు మీరి ప్రవర్తిస్తున్నారన్నారు. తెలుగుదేశం నీతికి కట్టుబడిన ప్రభుత్వమని, తనతో సహా ఎవరు తప్పు చేసినా శిక్షించమని ప్రజలను కోరారు.

అదే విధంగా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి అవినీతికి పాల్పడుతున్నాడని విమర్శలు చేశారు. వైసీపీలో ఉన్న వారు బంధువులు, స్నేహితులు, చుట్టాలని ఉపేక్షించవద్దని మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి తొలిమాటగా చెప్పారని, ప్రజలకు మేలు జరగాలి అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని చెప్పారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ఇక్కడ జరగనివ్వడం లేదన్నారు. సుండుపల్లెలో అర్ధరాత్రి టిప్పర్లతో మట్టి తోలుతున్న వాళ్లను ప్రోత్సహిస్తోంది మంత్రి కాదా? అని ప్రశ్నించారు. రాజంపేటలో ఇసుకదందాకు తెరలేపుతున్నారని, వైసీపీతో కలిసి టీడీపీని నిర్వీర్యం చేయాలనుకుంటే కార్యకర్తలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. సిద్దవటం మండలంలో ఇసుక రీచ్ ఓపెన్ కావడం లేదని, కాని అర్ధరాత్రి పెద్దఎత్తున ఇసుక టిప్పర్లతో బయటి ప్రాంతాలకు వెళుతుందని అన్నారు. పాలనలో జరిగే పొరపాట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్చించడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వంలో జరిగే లోటుపాట్లను పార్టీ దృష్టికి తీసుకుపోవడం ద్వారా పార్టీలో చర్చించి లోపాలను సరిదిద్దుతారని, అందుకోసం ప్రతి ఒక్కరు ప్రశ్నించే తత్వం అలవరుచుకోవాలన్నారు. అనంతరం 100 రోజుల ఎన్డీయే పాలనపై, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సుండుపల్లె ఎంపీపీ రాజమ్మ, టీడీపీ నాయకులు శివకుమార్ నాయుడు, శివప్రసాద్ నాయుడు, దామోదర్‌నాయుడు, ప్రతాప్ రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, రమేశ్ నాయుడు, యూసుఫ్, యూనియన్‌బాషా, గురుస్వామినాయుడు, జనసేన నాయకులు రామాశ్రీనివాసులు, ఒంటిమిట్ట టీడీపీ నాయకులు బాలిశెట్టి హరిప్రసాద్, గజ్జల నరసింహారెడ్డి, బొబ్బిలిరాయుడు, రమణ, ఎంవీ రమణ, వీరాంజనేయరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఒంటిమిట్టలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభలో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

వందరోజులు అయ్యీ కాకనే..

కూటమి ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులైనా సక్రమంగా కాకముందే.. రాజంపేట నియోజకవర్గంలో అధికార పార్టీ కుమ్ములాటలు రచ్చకెక్కడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కొందరు నాయకుల వల్లే నియోజకవర్గంలోని టీడీపీలో గొడవలు జరుగుతున్నాయని, అధిష్టానం, ఇతర నాయకుల మీద ఆధారపడకుండా.. స్వయంగా జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.


చెరువును ఆక్రమించుకుని కంచె వేసిన దృశ్యం

కంటేవారిపల్లె సమీపంలో
కొత్తచెరువు కబ్జా

- దాదాపు 10 ఎకరాలకు పైగా ఆక్రమణ
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

కురబలకోట, సెప్టెంబరు 23: వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. అధికారం తమదే అన్న ధోరణితో విచ్చలవిడిగా ప్రవర్తించారు. వైసీపీ నేతల కన్ను దేనిపై పడితే అది వారి సొంతం కావాల్సిందే అన్న చందంగా సాగింది. దీంతో మండలంలోని పలుచోట్ల చెరువులు, డీకేటీ భూములను ఆక్రమించుకున్నారు. కురబలకోట మండలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ నేతల భూదాహానికి చెరువులు, వంకలు, వాగులు తమ రూపాలను పూర్తిగా కోల్పోయాయి. గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని ఉపయోగించి దోచుకున్నోడికి దోచుకున్నంత అన్న చందంగా వ్యవహరించి నిబంధనలను తుంగలో తొక్కి తమ పనులను కానిచ్చేశారు. కురబలకోట మండలం ఎర్రబల్లి పంచాయతీలోని కంటేవారిపల్లె సమీపంలో 22 ఏళ్ల క్రితం ప్రభుత్వం కొత్త చెరువును నిర్మించింది. చెరువు నిర్మాణానికి అవసరమైన భూములను పలువురు రైతుల నుంచి కొనుగోలు చేసి వారికి నష్టపరిహారాన్ని అందజేసింది. కాగా సర్వే నెంబర్లు 1871, 1872, 1876, 1877, 1878, 1879, 1881, 1882, 1883లలో 25.01 ఎకరాల భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకుని చెరువును నిర్మించారు. దీంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులు, మూగజీవాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే వైసీపీ నేతల కళ్లు ఆ ప్రాంతంపై పడటంతో చెరువును ఆనుకుని రైతుల అనుభవంలో ఉన్న డీకేటీ భూములను రైతులకు డబ్బు ఆశ చూపి కారుచౌకగా కొనుగోలు చేశారు. డీకేటీ భూమిని కొనుగోలు చేయడంతో ఆ భూమిని ఆనుకుని ఉన్న చెరువు భూములను ఇష్టానుసారంగా ఆక్రమించుకుని కంచె నాటేశారు. 25 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు దాదాపుగా 10 ఎకరాల వరకు పలువురు ఆక్రమించుకున్నారు. కాగా పశువుల కాపరులు, గొర్రెల కాపరులు ఆ ప్రాంతంలోకి వెళితే వారిని బెదిరిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎకరం దాదాపుగా రూ.50 లక్షల వరకు పలుకుతోంది. చెరువు ఆక్రమణకు గురైన విషయాన్ని రెవెన్యూ అధికారులకు పలుమార్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

విచారణ చేసి స్వాధీనం చేసుకుంటాం..

మండలంలోని కంటేవారిపల్లె సమీపంలోని కొత్తచెరువును ఎవరు ఆక్రమించుకున్నా వారి నుంచి స్వాధీనం చేసుకుంటాం. ఆ చెరువుకు సంబంధించి సర్వే చేసి ఆక్రమణలకు గురైనట్లు తేలితే ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకుని చెరువుకు పూర్వపు స్థితిని తీసుకొస్తాం.

- తపశ్విని, తహసీల్దార్


ఆక్రమణకు గురైన కంటేవారిపల్లె సమీపంలోని కొత్త చెరువు

జిల్లా రవాణా శాఖలో బదిలీలు

కలికిరి, సెప్టెంబరు 23: కడప, అన్నమయ్య జిల్లాల్లోని రవాణా శాఖ అధికారుల బదిలీలు జరిగాయి. ఆదివారం రాత్రి బదిలీలకు సంబంధించిన జాబితాలు విడుదలయ్యాయి. కడప డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్‌ను విజయవాడ రహదారుల భద్రతా విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం డీటీసీ ఎ.చంద్రశేఖర్‌రెడ్డిని కడప డీటీసీగా బదిలీ చేశారు. మదనపల్లె రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి (ఆర్‌టీవో)గా కోనసీమ జిల్లా నుంచి డీఏ ప్రతాపరావును బదిలీ చేశారు. అదే విధంగా తెనాలి నుంచి ఆర్టీవో కె.ప్రసాద్‌ను బదిలీ చేసి అన్నమయ్య జిల్లా డీటీవోగా నియమించారు. రాయచోటి డీటీవో కార్యాలయంలో ఆర్‌టీవోగా పనిచేస్తున్న లాల్ సింగ్ చవాన్‌ను కర్నూలు జిల్లా డీటీసీ కార్యాలయంలో ఆర్టీవోగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర రహదారులు, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.

రహదారులు, భవనాల శాఖలో...

కడప, అన్నమయ్య జిల్లాల్లో రహదారులు, భవనాల శాఖలో పలువురు ఇంజనీర్లను బదిలీ చేశారు. మంగళగిరి ఏపీఎంఎస్ఐడీసీ నుంచి జి.అరవిందా దేవిని బదిలీ చేసి మదనపల్లె ఈఈగా నియమించారు. కడప డీఎస్ఈ సర్కిల్‌లో పనిచేస్తున్న ఎం.కె.మాధవిని పులివెందుల ఈఈగా బదిలీ చేశారు. కర్నూలు సర్కిల్ నుంచి డి.సోనియా బిందును బదిలీ చేసి కడప సర్కిల్ డీఎస్‌ఈగా నియమించారు. కడపలో పనిచేస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఈఈ జి.గీతారాణిని గుంటూరు డీఎస్ఈ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఆదోని నుంచి కె.కృష్ణారెడ్డిని బదిలీ చేసి కడప క్యూసీ విభాగం ఈఈగా నియమించారు. పులివెందుల ఈఈ వై.సిద్దారెడ్డిని కర్నూలు డీఎస్ఈ సర్కిల్‌కు కేటాయించారు. మదనపల్లెలో పనిచేస్తున్న ఈఈ హెచ్.శ్రీనివాసులును చిత్తూరుకు బదిలీ చేశారు. కనిగిరి నుంచి వై.నాగేశ్వరరెడ్డిని బదిలీ చేసి కడప ఈఈగా నియమించారు.

జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్‌పై విచారణ

- అనంతపురం జేడీగా పనిచేసే సమయంలో నిధుల గోల్‌మాల్
- ఈ-క్రాప్ నమోదులో వీఏఏ, ఏవో, ఏడీఏలతో పాటు ఇరుక్కున్న చంద్రానాయక్
- విచారణ కోసం షోకాజ్ నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి, సెప్టెంబరు 23: అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) బి.చంద్రానాయక్‌పై విచారణ జరపడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. అనంతపురం జిల్లాలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసే సమయంలో 2021లో అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పంట పరిహారం కోసం విడుదలైన నిధుల్లో రూ.10,39,085 ఐదుగురు అనర్హులైన రైతులకు పంపిణీ కావడంలో నిర్లక్ష్యం వహించారనే ప్రధాన అభియోగంతో డీఏవోపై విచారణకు ప్రభుత్వం ఉపక్రమించింది. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా విడపనకల్ మండలం డోనెకల్ గ్రామంలో 2021 ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు అధిక వర్షాల కారణంగా నష్టం వాటిల్లింది. రైతులకు పరిహారంగా పంపిణీ చేసిన నిధుల్లో రూ.1,52,02,812లు అనర్హులకు అందజేశారని, అదే సమయంలో అన్ని అర్హతలున్న తన తల్లికి పరిహారం ఇవ్వలేదని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన బి.రాంబాబు 2022లో లోకాయుక్తను ఆశ్రయించాడు. దీనిపై విచారణ జరపగా రూ.10,39,085 అనర్హులు లబ్ధి పొందినట్లు తేలింది. ఎలాంటి సాగుకు నోచుకోని భూములతో పాటు వామిదొడ్డి (గడ్డి వామి వేసే స్థలం), ఇంటి స్థలాల సర్వే నెంబర్లకు పరిహారం చెల్లించినట్లు గుర్తించారు. ఈ-క్రాప్ నమోదు చేసిన వీఏఏ విజయభాస్కర్ ఇచ్చిన వాంగ్మూలం మేరకు ఈ-క్రాప్ నమోదు చేసిన కారణంగానే అనర్హులు లబ్ధి పొందినట్లు తేల్చారు. స్థానిక వీఏఏ ఈ-క్రాప్ నమోదు చేసిన అనంతరం అందులో మండల వ్యవసాయాధికారి 20 శాతం, ఏడీఏ 20 శాతం, జాయింట్ డైరెక్టరు 5 శాతం నమోదును పరిశీలించి ధృవీకరించాల్సి ఉంది. అయితే ఈ-క్రాప్ పరిశీలనలో వీరు ముగ్గురూ విఫలమైనట్లు ప్రభుత్వం నిర్ధారించింది. ఫలితంగా జేడీ (ప్రస్తుత అన్నమయ్య జిల్లా డీఏవో) చంద్రానాయక్, ఉరవకొండ ఏడీఏ ఎస్.పద్మజ, ప్రస్తుతం అనంతపురం ఏడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న విడపనకల్ మండల వ్యవసాయాధికారిణి ఆర్.మధుమతి, డోనెకల్ వీఏఏ విజయభాస్కర్‌ల నిర్లక్ష్యం కారణంగానే నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. తదుపరి విచారణ కోసం ముందస్తుగా వీరందరి సంజాయిషీలు, వివరణలు తీసుకోవడానికి అనువుగా సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 10 రోజుల్లోగా సంజాయిషీలు, వివరణలు సమర్పించని పక్షంలో ఆరోపణలను అంగీకరించినట్లుగానే భావించి తదుపరి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఈ నోటీసులు జారీ చేశారు.

కొడుకే...కాలయముడయ్యాడు

- తల్లిని గొంతు కోసి చంపిన కొడుకు
- ములకలచెరువులో దారుణం

ములకలచెరువు, సెప్టెంబరు 23: కన్నవాడే కాలయముడయ్యాడు. తల్లిని అతి కిరాతకంగా గొంతు కోసి చంపాడు. ములకలచెరువులో చోటు చేసుకున్న ఈ దారుణం అందరినీ కంటనీరు పెట్టిస్తోంది. పోలీసుల కథనం మేరకు...ములకలచెరువులోని కదిరి రోడ్డుకు చెందిన షేక్ హైదర్‌వలి భార్య షేక్ షఫియాబేగం (55)కి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. భర్త ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమె చిన్న కొడుకు రెడ్డిబాషా వద్ద ఉంటోంది. ఈ క్రమంలో రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చిన రెడ్డిబాషా తల్లితో గొడవకు దిగాడు. ఇంతటితో ఆగకుండా కన్న తల్లి గొంతు కోశాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది సూచనల మేరకు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. కొడుకు చేతిలో తల్లి దారుణ హత్యకు గురి కావడంతో ములకలచెరువులో చర్చనీయాంశంగా మారింది. సంఘటనా స్థలాన్ని సీఐ రాజారమేష్, ఎస్ఐ గాయత్రిలు పరిశీలించి సంఘటనపై ముమ్మర విచారణ చేపట్టారు. అయితే కొడుకు తల్లికి చంపడానికి గత కారణాలు తెలియరాలేదు. విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.


దారుణ హత్యకు గురైన షఫియాబేగం

పేదల కడుపు నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 23: రాష్ట్రంలో ఎవరూ ఆకలితో అలమటించకుండా పేదల కడుపు నింపాలన్నదే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి మండిపల్లి, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదవారి ఆకలి తీర్చడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తిరిగి అన్న క్యాంటీన్లు ప్రారంభించినట్లు తెలిపారు. దినసరి కూలీలు, పరిశ్రమల్లో పనిచేసే వారికి అనుగుణంగా రూ.5కే రుచికరమైన భోజనం పెట్టడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. ప్రతి క్యాంటీన్ వద్ద ఒక్కొక్క పూటకు 400 మంది చొప్పున రోజుకు 1200 మందికి టిఫిన్, మధ్యాహ్నం, రాత్రికి భోజనం ఉంటుందన్నారు. ఇక నుంచి రాష్ట్రంలో ఎక్కడ కూడా ఆకలి కేకలు అనేవి ఉండవన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో అన్నక్యాంటీన్ వద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, 20వ వార్డు కౌన్సిలర్ మదన్‌మోహన్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి మట్లి శ్రీనివాసులునాయుడు, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు, రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, టీడీపీ నేతలు సుగవాసి విద్యాధర్, ఎద్దుల లక్ష్మీప్రసాద్, వెంకట్రమణారెడ్డి, సంజీవరెడ్డి, ఎజాజ్‌ఖాన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్‌లో అన్నం వడ్డిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాబోయే సీజన్‌కు కృష్ణా జలాలు అందిస్తాం

- చిప్పిలి సమ్మర్ స్టోరేజ పూర్తి చేసి మదనపల్లె దాహార్తి తీరుస్తాం
- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 23: రాబోయే సీజన్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా నిరంతరం కృష్ణా జలాలను అందిస్తామని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు కాలువల పరిశీలనలో భాగంగా ఆదివారం కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పర్యటించిన మంత్రి సోమవారం తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలలో పర్యటించారు. ఈ సందర్భంగా తొలుత హార్సిలీహిల్స్ నుంచి కురబలకోట మండలం దొమ్మన్నబావి వద్ద పుంగనూరు బ్రాంచి కెనాల్‌ను పరిశీలించిన మంత్రి మదనపల్లె మండలం చిప్పిలి సమ్మర్‌స్టోరేజి ట్యాంకు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఐదేళ్లుగా నిలిచిపోయిన ఎస్ఎస్ ట్యాంకు మొరవ పనులపై పరిశీలించారు. దీనిపై హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం సీఎంగా ఉన్న చంద్రబాబు రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు హంద్రీనీవా ప్రాజెక్టు నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఈ కాలువ గట్టుపైనే ఒక రాత్రి బసచేసి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయించి 90 శాతం హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయించారన్నారు. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో హంద్రీనీవా ప్రాజెక్టుకు కనీసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. సమ్మర్‌స్టోరేజి ట్యాంకులో ఉన్న ఇసుకను వైసీపీ నాయకులు ఐదేళ్ల పాటు దోచుకుతిన్నారని, దీని వలన ఎస్ఎస్ ట్యాంకులో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయన్నారు. ఈ గోతుల వలన వర్షపు నీరు సీపేజి అయి కట్ట దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. దొమ్మన్నబావి వద్ద పలు ప్రాంతాల్లో హంద్రీనీవా కాలువ లీకేజిలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో సిమెంట్ లైనింగ్ పనులు చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. అక్టోబరులో చిప్పిలి సమ్మర్ స్టోరేజి ట్యాంకు మొరవ పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. వచ్చే వేసవికి మదనపల్లె పట్టణ ప్రజలకు నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. హంద్రీనీవా పూర్తి చేసి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ సీఆర్ రాజగోపాల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మదనపల్లె సమీపంలోని చిప్పిలి సమ్మర్ స్టోరేజ ట్యాంకు వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

బి.కొత్తకోట కమిషనర్‌గా పల్లవి

బి.కొత్తకోట, సెప్టెంబరు 23: బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్‌గా నియమితులైన జీవీ పల్లవి సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన పీఆర్ మనోహర్ మదనపల్లె మునిసిపాలిటీ సెలెక్షన్ గ్రేడ్ మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. సత్యసాయి జిల్లా కదిరి మునిసిపల్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న జీవీ పల్లవికి ప్రభుత్వం ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆమె సోమవారం తన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బి.కొత్తకోట నగర పంచాయతీ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. పట్టణంలోని పలువురు ప్రముఖ నాయకులు, అధికారులు కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు చేపట్టిన పల్లవి

లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి

- క్యూఆర్ కోడ్ ద్వారా ఆలోచనలు, సలహాలు పంచుకోండి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 23: స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్య సాధన కోసం చేపట్టిన బృహత్తర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సంబంధించి ప్రజలతో పాటు వివిధ భాగస్వామ్య పక్షాల నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా ఆర్థిక, సామాజిక, అభివృద్ధితో పాటు వాతావరణ సుస్థిరతపై దృష్టి సారిస్తూ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఒక పెద్ద కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించే ప్రణాళికలు ఆవిష్కరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ ఫోన్ నుంచి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అక్టోబరు 5వ తేదీలోగా ప్రజలు వారి అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు.

Scan me !

ప్రజల అభిప్రాయాల కోసం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

అర్జీలను త్వరగా పరిష్కరించండి

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 23: జిల్లా నలుమూలల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లాలోని పోలీసు అధికారులను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశించారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన 75 మంది ఫిర్యాదుదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన 75 ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి వేగవంతంగా పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రైలు కిందపడి వ్యక్తి మృతి



రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 23: మండలంలోని శెట్టిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి చెన్నైకు చెందిన వ్యక్తి మృతి చెందాడు.. రైల్వే పోలీసుల వివరాల మేరకు... సోమవారం ఉదయం స్థాని కులు రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని సమా చారం ఇచ్చారు. ఈ మేరకు సంఘటన స్థలానికి వెళ్లి విచారించగా... మృతుడు చెన్నైకు చెందిన అరుణ్‌కుమార్‌గా(30) గుర్తించి శవ పరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్కూల్ వ్యాన్ ఢీకొని మహిళ...

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 23: మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ వ్యాన్ ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిని మద్దూరి బుజ్జమ్మ(45) మృతి చెందింది. స్థానికుల వివ రాల మేరకు.. మృతురాలు మతిస్థిమితం లేక గ్రామంలో సంచరిస్తూ ఉండేది. సోమవారం స్కూల్ వ్యాన్ పిల్లల ను ఎక్కించుకుని రివర్స్ తీస్తుం డగా ఆమెను ఢీకొన డంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు గుర్తించి హుటాహుటిన తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బం. దువులు, పోలీసులు తెలిపారు. ఈసంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కోడూరు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి...



మహబూబ్‌బాష (ఫైల్)

జమ్మలమడుగు, సెప్టెంబరు 23: మండలంలోని దేవగుడి గ్రామం పెన్నానది వద్ద ఎక్కలూరు షేక్ మహబూబ్‌బాష (32) అనే వ్యక్తి అను మానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. దేవగుడి గ్రామానికి చెందిన మహబూబ్‌బాష వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం భార్య కువైట్ లో ఉంది. అయితే 21వ తేదీ ఉదయం 11గంటల సమ యంలో గ్రామంలో ఓ పెళ్లి సందర్భంగా బంధువులైన ఇద్దరితో కలిసి మద్యంసేవించాడు. గ్రామం పక్కనే ఉన్న పెన్నానదిలోకి స్నానానికి వెళ్లాడు. ఆ రోజు నుంచి తిరిగి రాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసు లు విచారణ చేస్తుండగా సోమవారం ఉదయం దేవగుడి గ్రామం పెన్నానది శివార్లలో మృతదేహం లభ్యమైంది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి అర్బన్ పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతదేహానికి ఘటనా స్థలంలోనే వైద్య బృందంచే పోస్టుమార్టం నిర్వహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

మోరీని ఢీకొని వ్యక్తి ..

సిద్దవటం, సెప్టెంబరు 23: మండలంలోని నేకనాపురం క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ద్విచక్ర వాహనంలో వస్తూ అతివేగంగా వస్తూ.. బెటాలియన్ కల్వర్టు సమీపంలో మోరీని ఢీకొన్నాడు. దీంతో ఆ వ్యక్తికి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని.. ఆచూకీ కోసం విచారణ చేస్తున్నా మని ఎస్ఐ తెలిపారు.

తాగుడుకు బానిసై ఆత్మహత్య



జమ్మలమడుగు, సెప్టెంబరు 23: జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సంజాముల దస్తగిరి (40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా.. దస్తగిరి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈయన గత మూడు నెలలుగా కూలి పనులకు వెళ్లకుండా తాగుడుకు బానిసయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

13 దుంగలు పట్టివేత

వేంపల్లె, సెప్టెంబరు 23: మండలంలోని అలిరెడ్డిపల్లె సమీపంలోని కొండ ప్రాంతంలో దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వేంపల్లె ఫారెస్టు అధికారులకు అందిన సమాచారంతో తనిఖీలు నిర్వహించగా అలిరెడ్డిపల్లె ప్రాంతంలోని ట్రెంచ్ వద్ద కప్పి ఉంచిన ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాటిని స్థానిక అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. ఎర్రచందనం దుంగలను దాచి ఉంచిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు వేంపల్లె అటవీశాఖ అధికారులు తెలిపారు.

మోటరుబైకు షెడ్డులో అగ్నిప్రమాదం

● రూ.5లక్షలు ఆస్తినష్టం



పోరుమామిళ్ల, సెప్టెంబరు 23: పోరుమామిళ్లలోని మల్లకతవ సమీపంలో ఉన్న బాలాజీ బైకు మెకానిక్ షాపులో సోమవారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో షాపులో ఉన్న మోటరు బైకులు, సామాన్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. దాదాపు రూ.5లక్షలు నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు. పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ బాధితున్ని పరామర్శించి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

భయం గుప్పిట్లో.. శెట్టివారిపల్లె

● గ్రామం చుట్టూ కొండ ప్రాంతం, గాలేరు-నగిరి కాల్వ ● రాత్రి వేళ అడవి జంతువులు చిరుతల సంచారం
● బిక్కు బిక్కుమంటూ గ్రామ ప్రజల జీవనం ● గత టీడీపీ ప్రభుత్వంలో ముంపు గ్రామంగా ప్రకటన
● అమలు కాని వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి హామీ ● కూటమి ప్రభుత్వంపై ఆశలు ● ముంపు గ్రామంగా ప్రకటించాలని వేడుకోలు

ఆ గ్రామం చుట్టూ కొండ ప్రాంతం.. ఓ వైపు గాలేరు-నగిరి ప్రధాన కాల్వ... గ్రామంలో నుంచి ప్రధాన రహదారికి రాకపోకలు సాగించాలంటే.. ఉన్న ఒకే ఒక్క వంతెనే మార్గం.. ఇక వర్షాకాలం వచ్చిందంటే.. కొండ ప్రాంతం నుంచి గ్రామాన్ని వర్షపు నీరు చుట్టు ముట్టడం.. రాత్రి అయ్యిందంటే అడవి జంతు వుల సంచారం.. ఇలా ఏళ్ల తరబడి ఆ గ్రామ ప్రజలు బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామాన్ని ముంపు గ్రామం కింద ప్రకటించి న్యాయం చేస్తే.. ఊరు వదిలి వెళతామంటున్నారు. ఆ గ్రామ ప్రజల ఆవేదనను ఒక్కసారి పరిశీలిస్తే...

ముద్దనూరు సెప్టెంబరు 23: మండల పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామ ప్రజలు భయం గుప్పిట్లో బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. కొండప్రాంతం కావడం.. అడవి జంతువుల సంచారం కూడా ఉండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. మండల కేంద్రానికి దాదాపు 18కిలో మీటర్ల దూరంలో శెట్టివారిపల్లె ఉంది. గ్రామంలో దాదాపు 270 గృహాలు, 800 పైగా జనాభా ఉన్నారు. గ్రామం గండికోట కొండకు అనుకొని ఉంది. అంతేకాకుండా గ్రామం ముందు వైపు గాలేరు-నగిరి ప్రధాన కాల్వ ఏర్పాటు చేశారు. కాల్వ మీదుగా తాడిపత్రి ప్రధాన రహదారికి దాదాపు 2కిలో మీటర్లు ఉంటుంది. ఈ గ్రామంలోకి వెళ్లాంటే రైల్వేబ్రిడ్జి కింద నుంచి వెళ్లాలి. ఇక వర్షం వస్తే కొండ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు గ్రామాన్ని చుట్టేస్తుంది. గ్రామంలోకి వెళ్లెందుకు గాలేరు-నగిరి కాల్వపై ఏర్పాటు చేసిన వంతెన ఒక్కటే మార్గం. ఈ బిడ్జి ప్రక్కన ఉన్న మట్టి కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. గ్రామంలోకి కనీసం ఆటోలు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. దీంతో గ్రామంలోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక చీకటి పడితే అడవి జంతువుల సంచారంతో గ్రామ ప్రజలు భయం భయంగా గడపాల్సి వస్తుంది. గండికోట బ్యాక్ వాటర్ గ్రామ సమీపంలో ఉండటంతో తాగునీటి కోసం చిరుతలు వస్తున్నాయని.. మూడేళ్ల క్రితం గ్రామ సమీపంలోని పొలాల్లో చిరుత కరెంటు షాక్‌తో మృతి చెందిందని గ్రామస్థులు చెప్పుకొస్తున్నారు.

ముంపు గ్రామంగా ప్రకటించాలి

గ్రామాన్ని గండికోట ప్రాజెక్టు ముంపు గ్రామంగా ప్రకటించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా పట్టించుకునే వారే లేరు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను తెలుసుకొని శెట్టివారిపల్లెను ముంపు గ్రామంగా ప్రకటిస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏరియల్ సర్వే కూడా చేశారు. ఇళ్ల సర్వే కూడా అయ్యింది. కొందరు అధికారులు డబ్బులు తీసుకొని ఇళ్ల సర్వేలో భారీ అవకతవకలు చేశారని కొందరు ఫిర్యాదు చేయడంతో సర్వే నిలిచిపోయింది. అయితే ఈ విషయంలో 2019 ఎన్నికల్లో భాగంగా గ్రామంలో వైసీపీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి శెట్టివారిపల్లెను ముంపు గ్రామంగా ప్రకటిస్తామని ఎంపీ అవినాష్‌రెడ్డి హామీ ఇచ్చారు.. అధికారంలోకి వచ్చినా హామీని నెరవేర్చలేదు. దీంతో 2024 ఎన్నికల్లో ఆ గ్రామ ప్రజలు ఎన్డీఏ వైపు మొగ్గు చూపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పకడ్బందీగా సర్వే చేసి శెట్టివారిపల్లెను ముంపు గ్రామంగా ప్రకటించాలని ప్రజలు కోరుతున్నారు.



కొండకు సమీపంలో ఉన్న శెట్టివారిపల్లె గ్రామం





గ్రామంలోకి వెళ్లే రహదారిలో ఉన్నరైల్వే బ్రిడ్జి, గాలేరు- నగిరి కాల్వపై ప్రమాదకరంగా ఉన్న వంతెన

భయం భయంగా జీవనం.. లక్ష్మినారాయణ



పుట్టినప్పటి నుంచి కొండప్రాంతంలోనే జీవనం గడుపుతున్నాం, అప్పట్లో ఎటువంటి భయం ఉండేది కాదు. గాలేరు-నగిరి కాల్వ ఏర్పాటు చేయడంతో రోడ్డుపైకి ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి. ఒక పక్క వంకలు, మరో పక్కన రైల్వే బ్రిడ్జి గ్రామానికి దారే లేదు. గ్రామ సమీపం వరకు చిరుతలు వస్తున్నాయి. భయం భయంగా బతకాల్సి వస్తుంది.

న్యాయం చేయండి... సుబ్బరాయుడు



గాలేరు- నగిరి కాల్వ ఏర్పాటు చేయడంలో గ్రామానికే రక్షణ కరువైంది. కాల్వ అవతలి వైపు పంట భూములు ఉన్నాయి. కాల్వ దాటుకొని వెళ్లాలంటే చాలా భయంగా ఉంది. మా పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి మాకు న్యాయం చేయాలి.

ఇంత కష్టం ఎప్పుడులేదు... నాగమ్మ



నాకు ఇంత వయస్సు వచ్చింది, గ్రామానికి ఇంత కష్టం ఎప్పుడు ఎరుగలేదు. పిల్లలు పని మీద గ్రామం విడిచి వెళితే ఇంటికి వచ్చేంత వరకు భయంగా ఉంటుంది. మా కాలం గడిచిపోయింది. పిల్లలను దృష్టిలో పెట్టుకొని గ్రామా న్ని రోడ్డు పైకి పంపండయ్యా.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : మంత్రి

రామాపురం, సెప్టెంబరు 23: రాయచోటి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గువ్వల చెరువు పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమానికి మంత్రితో పాటు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు కష్టాలు భరించలేక కూటమి ప్రభుత్వానికి భారతదేశంలోనే ఏ పార్టీకి దక్కనన్ని 164 స్థానాలను ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో కేవలం వంద రోజుల్లోనే వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల మన్ననలు పొందడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒకేసారి వెయ్యిరూపాయల పింఛన్ పెంచి ప్రతి నెల 1వ తేదీ నాలుగు వేల రూపాయలు పింఛన్ ఇవ్వడం జరుగుతోందన్నారు. గతంలో ప్రజలు బాత్‌రూములు కట్టుకోవడానికి కూడా ఇసుక దొరికే పరిస్థితులు లేవని.. నేడు అడిగిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఇసుక సరఫరా జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇది మంచి ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గువ్వలచెరువులో అంజనారెడ్డి ఆధ్వర్యంలో గర్భవతులకు చీర, సారె మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఆర్డీవో రంగస్వామి, డీపీవో ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు చంద్రమౌళి, రేఖం ఆంజనేయులు, చిట్టి రామసుబ్బయ్య, గ్రామ సర్పంచ్ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల నిరసనకు తలొగ్గిన యూసీఐఎల్



రైతుల పొలంలోని కెమికల్ బురదను తొలగిస్తున్న యంత్రాలు

వేముల, సెప్టెంబరు 23: కేకే కొట్టాల గ్రామస్తుల నిరసనకు యురేనియం సంస్థ ఎట్టకేలకు తలొగ్గింది. యురేనియం బాధితులకు 12మందికి 5.62 ఎకరాలకు ఇవ్వాల్సిన సుమారు రూ.2,84,084ల పెండింగ్ బకాయిలను స్థానిక ఆర్డీఓకు అందించారు. ఈనెల 16వ తేదీ యురేనియం పరిశ్రమ నుంచి కేకే కొట్టాల గ్రామ సమీపంలోని టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే గొట్టపు పైపులు లీకైన విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి కొట్టాల గ్రామస్థులు టెయిలింగ్ పాండ్ పైప్‌ల నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలతో పాటు ఇచ్చిన ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఆందోళన చేపట్టారు. వీరికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచు శ్రీనాథ్‌రెడ్డిలు మద్దతు ఇచ్చారు. న్యాయం చేసేంత వరకు పోరాడుతామన్నారు. లీకేజీ వల్ల కమికల్ బురదంతా వెళ్లిన రైతుల పొలాలను యురేనియం అధికారులు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకు రైతుల పొలాల్లోకి వెళ్లిన కెమికల్ ఉరదను తొలగించేందుకు ఒప్పుకోమని.. బలవంతపు చర్యలకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీచేశారు. దీంతో యురేనియం అధికారులు దిగివచ్చారు.

రౌడీ అనే మాట వినిపిస్తే తోలు తీస్తా : డీఎస్పీ

కడప (క్రైం), సెప్టెంబరు 23: కడప నగరంలో ఇక నుంచి రౌడీ అనే మాట వినిపిస్తే తోలు తీస్తామని.. రోడ్లపై అమాయకులపై దాడి చేస్తే సహించేది లేదని... రౌడీషీట్ ఓపెన్ చేస్తామని కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్ హెచ్చరించారు. నగరంలోని బిల్టప్ సర్కిల్‌లో వారంక్రితం షేక్ మహబూబ్‌బాషా అనే వ్యక్తిని ఏడుగురు వ్యక్తులు వెంటపడి నడిరోడ్డుపై చితగ్గొట్టారు. ఈ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. తాలుకా పోలీసుస్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. కడపకు చెందిన మహబూబ్‌బాష బిల్టప్ సమీపంలోని ఓ బార్‌లో కూర్చుని ఒంటరిగా మద్యం సేవిస్తున్నాడు. రామరాజుపల్లె లోహియానగర్‌కు చెందిన గూడూరు రాజగోపాల్ స్నేహితులతో కలిసి అదే బార్‌కు వచ్చారు. ఒంటరిగా ఉన్న మహబూబ్‌బాషాను పక్కకు వెళ్లాలంటూ దాడి చేశారు. దీంతో వారి దెబ్బలు తట్టుకోలేక మహబూబ్ బాషా పరిగెడుతుంటే రాజగోపాల్ అతని స్నేహితులు కలిసి వెంబడించి నడిరోడ్డుపై దాడి చేశారు. ఈ కేసులో నిందితులైన గూడూరు రాజగోపాల్, మహబూబ్‌బాషా, షేక్ నూరుల్లా, శీలం బాలస్వామి అలియాస్‌బాలు, షేక్ జిలానీబాషాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిలో బాలస్వామిపై తాలుకా పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ ఉందన్నారు. నడిరోడ్డుపై రౌడీల్లా ప్రవర్తిస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు.

తమిళనాడు నేరస్థుడు కడపలో అరెస్టు

● చెన్నైలో ఎదురు కాల్పుల్లో మృతి

కడప (క్రైం), సెప్టెంబరు 23: తమిళనాడు రాష్ట్రంలో పలు నేరాల్లో ఉన్న నిందితుడు సీజింగ్ రాజా కడపలో తలదాచుకున్నాడు. ఈ మేరకు సమాచారం రావడంతో అతడిని తమిళనాడు పోలీసులు ఆదివారం రాత్రి కడపలో అదుపులోకి తీసుకుని చెన్నై తీసుకెళ్లారు. ఇతను చెన్నై నీలాంగరై వద్ద సోమవారం వేకువజాము పోలీసుల ఎదురు కాల్పులలో హతమయ్యాడు. సీజింగ్ రాజా చెన్నై ఈస్ట్ తాంబరంలో నివసించేవాడు. చెన్నై, పరిసర జిల్లాల్లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ హత్యాయత్నం, దోపిడీలు తదితర నేరాలకు పాల్పడ్డాడు. ఏడుసార్లు గూండా చట్టం కింద అరెస్టయ్యాడు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్య జరిగిన తర్వాత తమిళనాట పోలీసులు రౌడీలవేట కొనసాగిస్తున్నారు. కడపలో దాక్కున్న సీజింగ్ రాజాను ప్రత్యేక దళం పోలీసులు అరెస్టు చేసి చెన్నైకి తీసుకెళ్లారు. సోమవారం వేకువజాము వ్యాన్‌లో నీలాంగరై ఇస్కాన్ ఆలయ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఓ చోట భూమిలో పాతిపెట్టిన తుపాకులను రాజా తవ్వితీసి, ఊహించని విధంగా ఓ తుపాకీతో పోలీసులపై కాల్పులకు పాల్పడ్డాడు. పోలీసులు హెచ్చరించినా కాల్పులు జరపటంతో సీఐ విమల్ ఆత్మరక్షణ కోసం తుపాకీతో రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ సంఘటనలో రౌడీ సీజింగ్ రాజా అక్కడికక్కడే మృతి చెందాడు.

వైవీయూలో విద్యార్థికి తేలుకాటు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 23: వైవీయూలో సోమవారం ఉదయం బాత్‌రూములో తెలుగుశాఖకు చెందిన జయరాజ్ అనేవిద్యార్థికి తేలు కుట్టింది. ఈ విషయం తెలుసుకున్నవిద్యార్థులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా మెస్‌లో విద్యార్థికి తేలు కుట్టినా అధికారులు ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. యూనివర్శిటీలో పారిశుద్ధ్య లోపం వల్లనే తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని విద్యార్థులు మండిపడుతున్నారు.

బండరాయి కింద పడి వ్యక్తి మృతి



బండరాయి కిందపడి మృతి చెందిన మల్లయ్య కాళ్లు బయటికి కనపడుతున్న దృశ్యం, గుట్ట వద్ద గుడికూడిన గ్రామస్తులు, మల్లయ్య (ఫైల్)

రాయచోటిటౌన్, సెప్టెంబరు23: రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడుకు సమీపంలోని గుట్ట వద్ద గౌనిపల్లి మల్లయ్య (55) అనే వ్యక్తి సోమవారం ప్రమాదవశాత్తు బండరాయి కిందపడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే.. చిన్నమండెం మండలం వండాడి గ్రామం తొట్టికాడ కుర్వపల్లికు చెందిన గౌనిపల్లి మల్లయ్య రాళ్లను కొట్టి అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. అయితే మల్లయ్య ప్రతిరోజు లాగే సోమవారం కూడా రాళ్లు కొట్టేందుకు గుట్టకు వెళ్లగా అక్కడ రాళ్లు కొడు తూ పెద్దబండరాయి కింద మట్టిని తవ్వుతున్న క్రమంలో బండరాయి వచ్చి మీద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమా చారం ఇచ్చారు. ఈమేరకు రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరసింహారెడ్డి, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశాన స్థలం చూపించాలంటూ శవంతో రాస్తారోకో



నరసింగపల్లె వద్ద రోడ్డుపై శవంతో బైఠాయించిన గ్రామస్తులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 23 : చనిపోయిన వ్యక్తికి ఖననం చేయడానికి స్థలం లేదని.. గతంలో ఉన్న స్థలాన్ని వీఆర్వో తన కుటుంబ సభ్యుల పేరుతో పట్టా చేసుకుని ఆక్రమించాడంటూ నరసింగపల్లెకు ప్రజలు రాస్తారోకో చేశారు. తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపిస్తానని తెలపడంతో వారు ఆందోళన విరమించారు. వివరాలిలా.. రంగసముద్రం పంచాయతీ పరిధిలోని నరసింగపల్లెలో సోమవారం సుబ్బయ్య అనే వ్యక్తి చనిపోవడంతో భూస్థాపన సమస్య వచ్చింది. శ్మశానం కోసం గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. గ్రామంలో ఎవరు చనిపోయినా శ్మశాన వాటికలో స్థలం లేక ఇబ్బందులకు గురవుతున్నామని.. తాము ఎక్కడ ఖననం చేయాలో చెప్పేంత వరకు రాస్తారోకో విరమించే ప్రసక్తి లేదన్నారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ వారికి నచ్చచెప్పినా ఆందోళన విరమించలేదు. చివరికి తహసీల్దారు సిబ్బందితో వచ్చి భూస్థాపితం చేసేందుకు స్థలం చూపించడంతో శాంతించారు. రికార్డులు పరిశీలించి శాశ్వత శ్మశాన వాటిక పరిష్కారానికి కృషి చేస్తానని తెలపడంతో రాస్తారోకో విరమించారు.

దౌర్జన్యంగా రాతిస్తంభాలను పగులగొట్టిన వైసీపీ నేత.. నలుగురిపై కేసు

కాశినాయన సెప్టెంబరు 23: అక్కంపేటకు చెందిన చిన్నపురెడ్డి లక్ష్మీదేవమ్మ తన పొలం చుట్టూ కంచె కోసం నాటించిన రాతి స్తంభాలను దౌర్జన్యంగా పగులగొట్టిన సంఘటనలో వైసీపీ నాయకుడు సిలేకామ్‌పల్లి కొండారెడ్డితో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ హను మంతు వివరాల మేరకు... లక్ష్మీదేవమ్మ కుటుంబీకులు అమగంపల్లెకు చెందిన దావీదు వద్ద సర్వేనెంబర్ 1232-ఏ1లో 3.32 ఎకరాలు 99 సంవత్స రాల లీజుకు తీసుకున్నారు. లక్ష్మీదేవమ్మ తన పొలం చుట్టూ కంచె ఏర్పా టు కోసం రాతిస్తంభాలను ఏర్పాటు చేసుకున్నారు. పక్కపొలానికి చెందిన బ్రంహంగారిమఠం మండలం చెంచయ్యగారిపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు కొండారెడ్డి కంచె ఏర్పాటు చేయవద్దంటూ అడ్డుపడ్డాడు. నాపొలం చుట్టూ కంచె ఏర్పాటు చేసుకుంటే నీకేంటి అభ్యంతరం అంటూ ఆమె రాతి స్తంభాలను ఏర్పాటు చేసుకున్నారు. కొండారెడ్డి శనివారం రాత్రి అనుచరులు, కుటుంబ సభ్యులతో కలిసి దౌర్జన్యంగా రాతిస్తంభాలను పగులగొట్టి సమీపంలోని బావిలో పడేశాడు. లక్ష్మీదేవమ్మ ఫిర్యాదు మేరకు కొండారెడ్డితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

సంబేపల్లె, సెప్టెంబరు 23: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభా గంలో జరిగిన క్రీడా పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి కి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషాలు తెలిపారు. సెప్టెంబరు 12వ తేదీ ప్రొద్దుటూరు జార్జ్ క్లబ్‌లో జరిగిన యోగా పోటీల విభాగంలో ప్రవీణ్‌కుమార్, అహమ్మద్, జశ్వంత్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఏపీఎస్ఆర్‌డబ్ల్యు గండి క్షేత్రంలో ఈనెల 13వ తేదీ జరిగిన రగ్బీ పోటీల్లో వెన్నెల, నెట్‌బాల్ విభాగంలో నరేంద్రనాయక్ ప్రతిభ చూపి ఎంపికయ్యారన్నారు. 17వ తేదీ కడప స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన మాడరన్ పెంటాతలెన్ గేమ్స్‌లో శర్వాణి, రూహీన్, లోకేశ్‌బాబు, గణేశ్, స్విమ్మింగ్ పోటీల విభాగంలో నాగేంద్ర నాయుడు, వై.లోకేశ్‌బాబు, గణేశ్‌లు 20వ తేదీ మేధా డిఫెన్స్ అకాడమీలో జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో గౌరీగణేశ్, మల్లికాంబ్ పోటీలో సాయిచందు ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలియజేశారు.

పటిష్టంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాం

రాయచోటి (కలెక్టరేట్) సెప్టెంబర్ 23:జిల్లాలో "ఇది మంచి ప్రభుత్వం" స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని బాధ్యత యుతంగా నిర్వహిస్తున్నామని, ప్రజల స్పందన అద్భుతంగా ఉందని కలెక్టర్ చామకూరు శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు వివరించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర విజన్ 2047, స్వచ్ఛ ఆంధ్ర, ప్రజాభిప్రాయ సేకరణ తదితర అంశాలపై సీఎస్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... "ఇది మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా మంత్రి పర్యవేక్షణలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు సంబంధించిన ప్రజాసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం రూపొందించిన క్యూఆర్ కోడ్‌పై ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రెటరీలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లు ప్రజలకు అర్థం అయ్యేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అభిప్రాయాలు , ఆలోచనలు, సలహాలు అభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఇందులో భాగంగా 100 రోజుల్లో ప్రభుత్వం ఏం సాధించింది, ఏ విధంగా పని చేస్తోంది, ఏఏ రంగాలలో ఎలాంటి ఆలోచనలు చేస్తోందన్న అంశాలను ప్రజలతో పంచుకోవాలన్నారు. ప్రజల అభిప్రాయం మేరకు ఈ పోర్టల్‌లో సలహాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల వారు, ప్రజాప్రతినిధులు, మేధావులు, వివిధ వర్గాలతో మాట్లాడి వారి ఆలోచనలు కూడా నేరుగా తెలుసుకుంటామన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047 విజన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, సీపీవో వెంకట పెద్దయ్య, జీఎస్‌డబ్ల్యూఎస్ లక్ష్మీపతి, సమాచార శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రసాయన రహిత విత్తనశుద్ధితో మేలు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 23 : ప్రకృతి వ్యవసాయ విధానంతో సాగు ఎంతో మేలు అని ఎన్‌సీపీ బుల్లయ్య తెలిపారు. చిన్నఓరంపాడు తమలపాకు రైతులకు విత్తనపు తీగలు నాటే సమయంలో పాటించాల్సిన శుద్ధి చర్యలను ఆయన వివరించారు. బీజామృతం తయారీ, వాడుకునే పద్ధతులను తెలియజేశారు. ఆవు పేడ, ఆవు మూత్రం, పుట్ట మన్ను, సున్నం కలిపి వాడితే గడ్డ తెగుళ్ళు, వేరుకుళ్ళ తెగులు దరిచేరవని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా సూచనలు, సలహాలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐకి సన్మానం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 23: బదిలీపై ఇంటెలిజెన్స్ విభాగానికి వెళ్లిన ట్రాఫిక్ సీఐ మహబూబ్‌బాషాను సోమవారం రాయచోటి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి, ఏఎస్ఐ జోసెఫ్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్లిన మహబూబ్ బాషా ఇంటెలిజెన్స్ విభాగంలో కూడా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

రైల్వే కోడూరు(రూరల్) సెప్టెంబరు 23: మండలంలోని శెట్టిగుంట పంచాయతీ పరిధిలోని మామిడి తోటలో సోమవారం కోడి పందెం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.18,346 నగదు 3 కోళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది వెంకటేష్, బాలాజీ రాయల్, ఆకేఫ్ పాల్గొన్నారు.

బొమ్మి హారికకు డాక్టరేట్



ఓబులవారిపల్లె, సెప్టెంబరు 23 : మండల కేంద్రంలోని పుటికివారిపల్లెకు చెందిన బొమ్మి హారిక తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు ప్రొఫెసర్ సుధా పర్యవేక్షణలో అనాలసిస్ ఆఫ్ వెబ్ యూజెస్ మైనింగ్ బెస్ట్ ఆన్ వెబ్ లాస్ డేటా అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించినట్లు ఆమె తెలిపారు. ఆమె భర్త డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సి పాల్ బాలాజీ, ఐటీ విభాగం సిబ్బంది, బంధుమిత్రులు అభినందనలు తెలియజేశారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి చర్యలు

● రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 23: డ్వాక్రా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల బలోపేతానికి విశేష కృషి చేస్తోందని, గతంలో డ్వాక్రా సంఘాలకు ఇచ్చే రుణాలను ఐదు నుంచి 10 లక్షల వరకు పెంచామన్నారు. డ్వాక్రా మహిళలు ఉత్పత్తి చేసే బ్యాగులు, తినుబండారాలను మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా విక్రయించుకుని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. డ్వాక్రా సంఘాలు ఉత్పత్తి చేసే వివిధ రకాల ఉత్పత్తులను నెలలో రెండు రోజుల పాటు విక్రయించుకునేందుకు మెప్మా అర్బన్ మార్కెట్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ డ్వాక్రా సంఘాల్లో చేర్పించి సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం

చిన్నమండెం: చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, భూకబ్జాలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది వేధింపులు, నిరుద్యోగం తదితర సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు అనంతరం గ్రామంలో రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేస్తామన్నారు.

రామాపురం: మండలంలోని బండపల్లి టోల్ ప్లాజా నుంచి శ్రీమహావిష్ణువు దేవస్థానం వరకు నిర్మించిన సిమెంటు రోడ్డు పనులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. పప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, పక్కీరారెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులుగౌడ్, తుమ్మల ఓబులేసు, చింతపిచ్చల రామకృష్ణగౌడ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ● టీడీపీ ఇన్‌చార్జితో కలసి రోడ్డు పనులకు భూమిపూజ



కొబ్బరికాయలు కొట్టి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 23: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పలు అభివృద్ధి పనులు అమలు చేశామని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. మండల పరిధిలోని కాకర్లవారిపల్లె గ్రామ పంచాయతీలో సుమారు రూ7.52 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులకు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డితో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంతో రోడ్డు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, కల్లా చలపతి, రామచంద్రయ్యనాయుడు, శివయ్యనాయుడు, సర్పంచ్ వెంకటయ్యనాయుడు, వేమన సుబ్రమణ్యంనాయుడు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, పంచాయతిరాజ్ అధికారులు, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేటలోని ఎస్ఎస్ కల్యాణమండపంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ రైల్వేకోడూరులో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు అన్నమయ్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డితో మాట్లాడి ఒప్పించామన్నారు. 25 కోట్ల రూపాయలతో ప్రస్తుతం రోడ్ల పనులు చేస్తున్నామన్నారు. జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ జగన్ మోసపురెడ్డి రాష్ట్రాన్ని ఐదేళ్లలో అధోగతిపాలు చేశాడన్నారు. టీడీపీ మండల ఇన్‌చార్జి ఆరె సుధాకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు, జనసేన రాయలసీమ కన్వీనర్ జోగినేని మణి, మండల బీజేపీ అధ్యక్షులు రామకృష్ణయ్య, జనసేన మండల ఇన్‌చార్జి ప్రసాద్, డీఎల్‌పీవో నరసింహమూర్తి, ఎంపీడీవో రఘురాం, తహసీల్దారు అరవింద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు సంఘీభావంగా ప్రాయశ్చిత్త దీక్ష

రైల్వేకోడూరు: ప్రాయశ్చిత దీక్ష చేస్తున్న జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సోమవారం రైల్వే కోడూరులోని ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు దేవుడితో కూడా ఆటలు ఆడుకున్నారని తెలిపారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బోయపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మల్లెల శ్రీవాణి

నందలూరు, సెప్టెంబరు 23 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకుందని ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపల్లె సర్పంచ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జంబు సూర్యనారాయణతో కలసి నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు శివరామరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి పోతురాజు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: మండల టీడీపీ అధ్యక్షుడు భాను గోపాల్‌రాజు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. మండల టీడీపీ సీనియర్ నాయకుడు సురేంద్రారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులురెడ్డి, తెలుగు యువత టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలోని రేగుంటపల్లె, ఆర్కమ్మ పల్లెల్లో సోమవారం కట్టవారిపల్లె ఎంపీటీసీ కస్తూరి శ్రీనివాసులు నాయుడు, సచివాలయ, అంగన్వాడీ సిబ్బందిఇది మంచి ప్రభుత్వ కరపత్రాలు, స్టిక్కర్లను పంచిపెట్టారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : పట్టణంలోని రామ్‌నగర్‌లో పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, జిల్లా టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ , బోయపాలెం, ఈడిగపాలెంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి, యువ నాయకులు మల్లెల సురేంద్ర ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, నరసింహ, కృష్ణ, ఆచారి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు ఈడిగపల్లెలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు గ్రామ అధ్యక్షుడు సుబ్బరామ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు

ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి



రాజంపేటలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని కార్మిక, రైతు సంఘాల నేతలు రామాంజులు, వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. బ్లాక్‌డే సందర్భంగా సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయానికి సమీపంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద ప్లకార్డులు చేతబట్టి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతు తన పొలంలో తానే కూలీగా పని చేసే పరిస్థితి తీసుకురావడంతో పాటు, కార్పొరేట్ వ్యవసాయానికి రెడ్ కార్పెట్ వేసి, అధిక ధరలు, ఆహార అభద్రతకు కేంద్ర ప్రభుత్వం కారణమవుతున్నదని విమర్శించారు. మరోవైపు ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటుపరం చేస్తూ వెనుకబడిన వర్గాల రిజర్వేషన్‌లకు మంగళం పాడుతోందని ఆరోపించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. మతతత్వం, కార్పొరేటీకరణతో దేశంలో అసమానతలు పెరిగిపోతాయన్నారు. మహిళలపై దాడుల నివారణకు చర్యలు తీసుకోలేని ప్రభుత్వాలకు ఈ బ్లాక్ డే చెంప పెట్టు అన్నారు. రైతు నాయకులు ఈశ్వరయ్య, జనకయ్య, కార్మిక నాయకులు మాధవయ్య, ఆంజనేయులు, రమేశ్, వాసు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: లేబర్ కోడ్‌ల రద్దు, కార్మికులకు రూ. 26 వేలు కనీస వేతనం , ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలంటూ సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు ఎం. సాంబశివ, పీఎల్ నరసింహులు,, సీహెచ్ చంద్రశేఖర్, పండుగోల మణి డిమాండ్ చేశారు. సోమవారం రైల్వేకోడూరు ప్రధాన దారిలో వేర్వేరుగా రాస్తారోకో, ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, సీఐటీయూ, సీపీఎం నాయకులు నగిరిపాటి ఆనంద్, లింగాల యానాదయ్య, హరినారాయణ, వేణు, ఎం. సుబ్బరాయుడు, లక్ష్మీకర్, ప్రసాద్, బలరాం, రాజశేఖర్, కేశవులు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు, నేతలు ఆర్ అండ్ బి అతిథిగృహం సమీపం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు మాట్లాడుతూ దేశంలో రైతులను సంరక్షించే విత్తన చట్టం లేదని, పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి విభజన చట్టంలోని హామీలను కూడా అమలు చేయలేదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపి విశాఖ ఉక్కును కాపాడాలని కోరారు.కార్మికులకు పనికితగ్గ కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర, పట్టణ కార్యదర్శి సికిందర్, నాగేశ్వరరావు, గోవిందు, యాదయ్య, విజయ్, రాము నాయక్, రమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు పరికరాల పంపిణీ

పెనగలూరు, సెప్టెంబరు 23: గతంలో గ్రామ సచివాలయాల ద్వారా ఎంపిక చేసిన దివ్యాంగులకు మంగళవారం పెనగలూరు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పరికరాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. పరికరాలకు ఎంపికైన దివ్యాంగులు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా సమాచారం తెలుసుకుని, హాజరు కావాలని కోరారు. ఎలిమ్కో కంపెనీ సహకారంతో నీతిఅయోగ్ ద్వారా ప్రభుత్వం ఈ పరికరాలను ఉచితంగా అందజేస్తుందని వివరించారు.

నేడు మెడికల్ అసెస్మెంట్ క్యాంపు

చిట్వేలి, సెప్టెంబరు 23 : మండలంలోని దివ్యాంగులందరికి (6 నుంచి 60 సంవత్సరాల వరకు) ఉపకరణల కొరకు మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేవారు యూడీఐడీ కార్డు, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు మండలంలోని ప్రత్యేక ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, ఐఈఆర్‌టీ 9490620447, శిరీషా ఐఈఆర్‌టీ 8501895665 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

లక్కిరెడ్డిపల్లె సెప్టంబరు 23: బాల్యవివాహాలను అరికట్టి బాలికల భవిష్యత్‌కు బంగారుబాట వేయాలని మమత ఫౌండేషన్ కోఆర్డినేటర్ అమృత పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే 1098 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయుడు రఘునాథరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలి



ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రాజశేఖర్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 23: మండలంలోని సమతానగర్ గిరిజనులకు పంపిణీ చేసిన భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి ఆన్‌లైన్ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ కోరారు. సోమవారం రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రెడ్డిప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కే. బుడుగుంటపల్లె పంచాయతీ పరిధిలోని సమతానగర్‌లో 30 ఏళ్ల క్రితం గిరిజనులకు పట్టాలు ఇచ్చారని, ఇంత వరకు భూమిని చూపించ లేదని, పాసుపుస్తకాలు ఇవ్వలేదని తెలిపారు. భూములను ఆన్‌లైన్ చేయడంలో అధికారులు ఎందుకింత అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోని పక్షంలో ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మొగిలి వినయ్, ననసయ్య, గిరిజనులు బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 23: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మండల సభాభవనంలో సోమవారం ప్రభుత్వ వైద్యులు పట్టణంలోని పారిశుధ్య కార్మికులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు వినయ్, హరికృష్ణ, సాయి, చైతన్య మాట్లాడుతూ ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, వ్యాధు లకు దూరంగా ఉండాలని కోరారు. బీపీ, షుగర్ తదితర నిర్ధారణ పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ శివరాం, స్టాఫ్ నర్సు శ్రీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ బాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 23 : మండలంలోని మంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చెత్తబుట్ట పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు అనుమలగుండం చంద్రమోహన్, గునిపాటి రాయుడు, సర్పంచు సుధాకర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చిన్నారులను కల్తీ ఆహారానికి దూరంగా ఉంచాలి



దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

సుండుపల్లె, సెప్టెంబరు23: చిన్నారులను కల్తీ ఆహారానికి దూరంగా ఉంచాలని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ సూచించారు. టీడీపీ నాయకుడు శరత్‌గిరిరెడ్డి తల్లి మాజీ సర్పంచ్ నిర్మలమ్మ వర్ధంతి సందర్భంగా సోమవారం గుల్లావాండ్లపల్లె, వెంగమరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలతో పాటు గుల్లావాండ్లపల్లె అంగన్వాడీ కేంద్రంలో దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ తిండితో పలు వ్యాధులు వస్తున్నాయని, చిన్నతనం నుంచే పాలు, కోడిగుడ్డు, ఆకుకూరలు తినడం అలవాటు చేయాలన్నారు. అనంతరం వైద్యురాలు మౌనిక వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, ప్రధానోపాధాయులు కృష్ణవేణి పాల్గొన్నారు.

జీతం ఇప్పించాలని సుగవాసికి వినతి



సుగవాసికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీ ఆయా, కార్యకర్తలు

సుండుపల్లె, సెప్టెంబరు 23: సుమారు పది నెలల నుంచి వేతనం అందడం లేదంటూ గుండ్లపల్లి అంగన్వాడీ కేంద్రం లో ఆయాగా పనిచేస్తున్న లక్ష్మమ్మతోపాటు పలువురు అంగన్ వాడీ కార్యకర్తలు సోమవారం టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని సూపర్‌వైజర్, సీడీపీవోల దృష్టికి తీసుకెళ్లామని, అయినా ప్రయోజనం లేకుండా పోయిందని వారు వాపోయారు. అధికారులతో మాట్లాడి వెంటనే జీతం మంజూరయ్యేలా చేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లి, సెప్టెంబరు 23: రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి కోరారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో సభ్యులు భాగస్వాములు కావాలన్నారు. ఏపీఎం ఖాదర్‌వలి మాట్లాడుతూ రుణాలు సక్రమంగా చెల్లించడం వల్ల అధిక రుణాలు పొందవచ్చునన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి గులాబ్‌జాన్, కోశాధికారి లావణ్య, ఉపాధ్యక్షురాలు, వారాదమ్మ, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్ల వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

వీరబల్లి, సెప్టెంబరు 23: తమకు ఉద్యోగ భద్రత కల్పించి జీతం పదివేలకు పెంచాలని మండల వలంటీర్లు సోమవారం ఎంపీడీవో రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వారు కోరారు. గత నాలుగు, ఐదు నెలలుగా జీతాలు రాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఎన్నికల సమ యంలో బలవంతంగా రాజీనామా చేసినవారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

సృజనాత్మకతతో అద్భుత ఫలితాలు



ప్రసంగిస్తున్న కేవీ ప్రదీప్

రాజంపేట, సెప్టెంబరు 23: సృజనాత్మకత, నైపుణ్యంతో అద్భుతాలు సాధించవచ్చునని సినీ హీరో, డైరెక్టర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్ కేవీ ప్రదీప్ తెలిపారు. సోమవారం అన్నమాచార్య యూనివర్సిటీ నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో పెంపొందించుకున్న జ్ఞానం భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉంటే విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యత అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లికార్జున రావు, డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతి ప్రదానం



బహుమతి ప్రదానం చేస్తున్న చొప్పా గంగిరెడ్డి

రాజంపేట, సెప్టెంబరు 23: ఔషధ దుష్ఫలితాలపై అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో గత వారం రోజుల శిక్షణ అనంతరం నిర్వహించిన క్విజ్ విజేతలకు అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి సోమవారం బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఫార్మసీ విజిలెన్స్ ఉత్సవాల సందర్భంగా ఔషధ దుష్ఫలితాలపై రోగికి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, డాక్టర్ గిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో వర్షం

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 23: మండలంలో సోమవారం ఒక మోస్తరు వర్షం కురవడంతో పట్టణంలోని గాంధీనగర్, నరసరాంపేట, రంగనాయకులపేట, పగడాలపల్లెల్లో వర్షపు నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

డెంగ్యూ మృతిపై కలెక్టర్ విచారణకు ఆదేశం

● వికోటలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



పట్టణంలో రాత్రి వేళ ఫాగింగ్

వి.కోట, సెప్టెంబరు 23: వి.కోటలో ఆరేళ్ల చిన్నారి డెంగ్యూతో మృతి చెందిన ఘటనపై కలెక్టర్ సుమిత్ కుమార్ విచారణకు ఆదేశించారు. వారం రోజుల వ్యవధిలో వి.కోటలో ఇద్దరు మృతి చెందడంపై తీవ్రంగా స్పందించారు. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో ఆరోగ్య సిబ్బంది సోమవారం మసీదు వీధికి చేరుకుని ఫాగింగ్ చేపట్టారు. ఓగు పీహెచ్‌సీ వైద్యులు రాజేష్‌నాయక్, ఏఎన్ఎంలు ఇంటింటా జ్వర బాధితులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. అవసరమైనవారికి మందులు అందజేశారు. పంచాయతీ సిబ్బంది వాడవాడలా ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. ఈశ్వర్‌నగర్, భారత్‌నగర్, బ్రాహ్మణవీధి, జైభీంనగర్, ఎంజీరోడ్డు తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు.

రూ.13లక్షల టపాసుల సీజ్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 23: పుంగనూరు పట్టణ పరిధిలోని మూడు టపాసుల దుకాణాలపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన రూ.13 లక్షల టపాసులను సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. తాటిమాకులపాళ్యం, నగిరివీధి, భగత్‌సింగ్ కాలనీల్లో ఎస్ఐ రాజేశ్‌తో కలసి దాడులు నిర్వహించారు. టపాసులను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

● కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23: రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్పీ మణికంఠ, డీటీసీ నిరంజన్‌రెడ్డితో కలిసి జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 2024 జనవరి నుంచి నేటి వరకు 119 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 64 మంది

సమీక్షలు - సమావేశాలు

మృతి చెందగా, 211 మంది గాయపడ్డారని తెలిపారు. జిల్లాలో 69వ నెంబరు జాతీయ రహదారి 84 కిలోమీటర్ల పరిధిలో ఉందని, ఈ ప్రాంతాల్లోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇక్కడ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలో లైటింగ్ ఉండేలా చూడాలన్నారు. పత్తికొండ, గంగవరం, బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల పీహెచ్‌సీ పరిధిల్లో రక్తం, అంబులెన్స్‌లు, నైట్‌డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ.. అతివేగమే ప్రమాదాలకు కారణమన్నారు. ఈ సమావేశంలో ఆర్టీవో సునీల్ కుమార్, ఎన్‌హెచ్ పీడీ వెంకటేశ్వర్లు, కార్తీక్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌ప్లాన్‌పై సూచనలు ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీకి ప్రజలు విలువైన సలహాలు, సూచనలు అందించి సీఎం ఫొటోతోపాటు ఆయన సంతకంతో కూడిన సర్టిఫికెట్‌ను పొందాలని కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను జేసీ విద్యాధరితో కలిసి ఆవిష్కరించారు. http://swarnandhra.ap.gov.in/ Suggestions. లింకుతో వచ్చే క్యూఆర్‌కోడ్ ద్వారా ఇందులో పాల్గొనాలని చెప్పారు. డీఆర్వో పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానశాఖ సేవలను అందిపుచ్చుకోండి

రాష్ట్రప్రభుత్వం ఉద్యాన రైతులకు అమలుచేస్తున్న వివిధ పథకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఉద్యానశాఖ రూపొందించి న పోస్టర్‌ను జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ పలువురు జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ యోజన ఆయిల్ పంప్ పథకాలలో ఆర్థికంగా అందిస్తున్న సహాయాన్ని, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాల్‌పోస్టర్లను రైతుల ఉపయోగంకోసం రైతు సేవాకేంద్రం, వ్యవసాయ, ఉద్యాన, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉంచాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారి మురళీ కృష్ణ, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, సీపీవో సాంబశివారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కి 240 అర్జీలు

● న్యాయం చేయాలంటూ కలెక్టర్‌ను వేడుకున్న జనం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబరు 23: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డీఆర్వో పుల్లయ్య, ఇతర అధికారులు జనం నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఆలకిస్తూ.. సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం తగు సలహాలు, సూచనలు, ఆదేశాలిచ్చారు. రెవెన్యూ విషయాలపై సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. కాగా, మొత్తం 240 మంది అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూశాఖకు సంబంధించినవే 191 వరకు ఉన్నాయి. తమ సమస్యలు పరిష్కరించి, న్యాయం చేయాలని వేడుకున్నారు.

ప్రధానంగా వచ్చిన అర్జీల్లో కొన్ని..

● తాతలకాలం నుంచి అటవీ భూములు సాగుచేసుకుంటున్న తమకు పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయాలని ఎస్ఆర్‌పురం మండలం మర్రిపల్లె ఎస్టీకాలనీకి చెందిన జయచంద్ర, నరసింహులు, బాలాజీ కోరారు. 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఐదేళ్లుగా పట్టాలివ్వమని ప్రాధేయపడినా అధికారులు కనికరించలేదన్నారు. అటవీ హక్కు చట్టం 2005 ప్రకారం ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను మంజూరు చేయాలని కోరారు.

● డప్పు కళాకారుల గుర్తింపు కార్డును ఇవ్వాలని పెద్దపంజాణి మండలం పెనుగొలకల దళితవాడకు చెందిన తిమ్మన్న కోరారు. డప్పు వృత్తిని నమ్ముకుని ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్నానన్నారు.

● తన భర్త ఆర్టీసీలో కండక్టర్‌గా ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతి చెందారని, కారుణ్య నియామకం కింద ఉద్యోగావకాశాన్ని కల్పించాలని సోమల మండలం ఆవులపల్లెకు చెందిన శంకరమ్మ కోరారు. పలుమార్లు ఆర్టీసీ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు.

ఎస్పీకి 31 అర్జీలు



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కి 31 మంది అర్జీదారులు హాజరయ్యారు. బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ వినతిపత్రాలను స్వీకరించి, సమస్యలను ఓపిగ్గా విన్నారు. డీఎస్పీ సాయినాథ్ పాల్గొన్నారు.

కడపజోన్ ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి బదిలీ

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 23: కడపజోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇటీవల ఆయన పదోన్నతిపై కడపజోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. వారం వ్యవధిలోనే బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఖాళీగా ఉన్న తిరుపతి డీపీటీవో పోస్టును రేపో మాపో భర్తీ చేయనున్నట్లు తెలిసింది. కడపజోన్ ఈడీగా పి.చంద్రశేఖర్, చిత్తూరు డీపీటీవోగా జగదీష్‌ను బదిలీ చేశారు. అలాగే వాకాడు డిపో మేనేజర్‌గా పెంచలయ్య, కుప్పం డిపో మేనేజర్‌గా గోపీనాథ్, శ్రీకాళహస్తి ఇన్‌చార్జి డీఎంగా తిరుపతి డిపో మేనేజర్ టి.బాలాజీ నియమించారు.









సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద భక్తుల కోలాహలం - ప్రాకారోత్సవంలో వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి - నాగులపుట్ట వద్ద భక్తుల పూజలు - శూలాలు గుచ్చుకుని వస్తున్న భక్తులు

వైభవంగా మూడో సోమవారోత్సవం

● భక్తజనసంద్రంగా రామకుప్పం

రామకుప్పం, సెప్టెంబరు 23: రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం జరిగిన మూడో సోమవారోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. పలమనేరు, కుప్పం నియోజకవర్గాలనుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు పట్టణాలు, గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కొందరు వెండితో చేసిన కళ్లు, చెవులు, నాగపడిగలు హుండీలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయ ఈశాన్య దిక్కున నాగులపుట్టలో పాలు, పండ్లు సమర్పించారు. పలువురు భక్తులు వీపుకు కొక్కీలు తగిలించుకుని తేర్లులాగుతూ, దవడలకు శూలాలు గుచ్చుకుని కావళ్లతో వచ్చారు. ఆలయ ఆవరణలోని నాగులమ్మ, శనీశ్వరస్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీవారు దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. డీఎస్పీ ప్రభాకర్, కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్లబూదుగూరు, గుడుపల్లె ఎస్ఐలు నరేష్, శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

రాయలసీమ జోన్ అటవీశాఖలో ముగిసిన బదిలీలు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 23: అటవీశాఖ రాయలసీమ జోన్-4 పరిధిలో ఫారెస్టు రేంజ్ అధికారుల బదిలీ పర్వం ముగిసింది. మొత్తం 21 మంది ఎఫ్ఆర్వోలను బదిలీ చేస్తూ ఫారెస్టు ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. చేపట్టిన బదిలీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎఫ్ఆర్వోలు అధికంగా ఉన్నారు. బదిలీ వివరాలు ఇలా ఉన్నాయి.. ఎఫ్ఎస్‌పీ, తిరుపతి ఎఫ్ఎస్‌డీలో పనిచేస్తున్న ఎస్.లక్ష్మీపతిని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం రేంజ్‌కు బదిలీ చేయగా, సత్యవేడు డివిజన్‌లోని జి.జయప్రసాద్‌రావును అన్నమయ్య జిల్లా మదనపల్లె రేంజ్‌కు బదిలీ చేశారు. పీలేరు రేంజ్ ఎఫ్ఆర్వో బి.రాంలానాయక్‌ను తిరుపతి (ఎఫ్ఎస్ డివిజన్) ఫ్లయింగ్ స్క్వాడ్‌కు, తిరుపతి డీఆర్ఎస్ డిపోలోని బి.ప్రియాంకను పీలేరు రేంజ్ ఎఫ్ఆర్‌వోగా బదిలీ చేశారు. రాజంపేట రేంజ్‌లోని ఆర్.నారాయణను పలమనేరు రేంజ్‌కు, పీలేరు ఎఫ్ఎస్‌డీలోని ఎన్.వెంకటరమణను తిరుపతి డివిజన్ భాకరాపేటకు రేంజ్‌కు బదిలీ చేయగా, అక్కడి ఎం.దత్తాత్రేయను అన్నమయ్య డివిజన్ రాజంపేట రేంజ్‌కు బదిలీ చేశారు. మదనపల్లె డివిజన్ ఎఫ్ఆర్వో కె.మదన్‌మోహన్‌రెడ్డిని కడప ఫ్లయింగ్ స్క్వాడ్‌కు, తిరుపతి సోషల్ ఫారెస్టు ఎన్.రమశంకర్‌ను తిరుపతి సీఆర్ఎస్ డిపోకు బదిలీ చేశారు. కదిరి సోషల్ ఫారెస్టు రేంజ్ ఎస్.వెంకటసుబ్బడును చిత్తూరు ఈస్టు రేంజ్‌కు,ఇక్కడి ఎన్.బాలకృష్ణారెడ్డిని నంద్యాల బంగనపల్లి సోషల్ ఫారెస్టు రేంజ్‌కు బదిలీ చేశారు. నంద్యాల జీబీఎం ప్రాజెక్టు టైగర్ ప్రాజెక్టు కె.త్రినాథ్‌రెడ్డిని తిరుపతి డివిజన్ సత్యవేడు రేంజ్‌కు, చిత్తూరు డివిజన్ పలమనేరు రేంజ్ జి.శివన్నను అన్నమయ్య డివిజన్ రాజంపేట రేంజ్‌కు బదిలీ చేశారు.

జిల్లాలో ఇలా..

చిత్తూరు జిల్లా అటవీ శాఖలోని పలు విభాగాల్లోని సిబ్బందిని బదిలీ చేస్తూ డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 26 మంది ఫారెస్టు బీట్ అధికారులను బదిలీ చేయగా, ఐదుగురు ఫారెస్టు సెక్షన్ అధికారులను, ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఆఫీసు సబార్డినేట్‌ను బదిలీ చేశారు.

టూరిజం కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు



ననియాల వాచ్ టవర్‌పై నుంచి అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి

రామకుప్పం/కుప్పం, సెప్టెంబరు 23: రామకుప్పం మండలం ననియాల పర్యావరణ పర్యాటక కేంద్రం నుంచి కుప్పం మండలం కనకనాశమ్మ ఆలయం వరకు టూరిజం కారిడార్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నట్లు అటవీ శాఖ రేంజ్ సీసీఎఫ్ నాగేశ్వరరావు, చిత్తూరు డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం వారు ననియాలలోని పర్యావరణ పర్యాటక కేంద్రం, కనకనాశమ్మ ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం అటవీ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి సీఎం చంద్రబాబు ప్రత్యేక ఆదేశాలిచ్చారన్నారు.అటవీ రేంజర్ జయశంకర్, ఆయా ప్రాంతాల అటవీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇకపై ఓటీపీ చెప్తేనే గ్యాస్ సిలిండర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23: వంటగ్యాస్ వినియోగదారులు నాలుగు అంకెల ఓటీపీ చెబితేనే ఇకపై సిలిండర్ల సరఫరా జరుగుతుందని హెచ్‌పీ గ్యాస్ చిత్తూరు, ట్రిప్లెక్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి రామమూర్తి తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేశాక వినియోగదారుడి రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు నాలుగు అంకెల ఓటీపీ వస్తుందన్నారు. దానిని డెలివరీ బాయ్‌కి చెబితేనే సిలిండర్ అందజేస్తారన్నారు. ఈ మేరకు గ్యాస్ కంపెనీల ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సూర్యప్రభ వాహనంపై పార్వతీసుతుడు



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 23: కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం వరసిద్ధి వినాయకస్వామి సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఈ కార్యక్రమానికి రాజమ్మ, రాజశేఖర్ నాయుడుల జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఇంద్రసేన నాయుడు, లక్ష్మీపతినాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం స్వామివారికి ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం చేశాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో కల్యాణ వేదిక వద్ద ఉత్సవర్లకు విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడి ఉత్సవ విగ్రహాలను సూర్య ప్రభ వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమాల్లో ఈవో గురుప్రసాద్, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు. మంగళవారం స్వామికి చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు.









ఆస్థాన మండపంలో నృత్యం చేస్తున్న కళాకారులు - పాతాళభైరవి పౌరాణిక నాటికలో ఓ సన్నివేశం

డిస్కంలో భారీగా బదిలీలు

తిరుపతి, (ఆటోనగర్), సెప్టెంబరు 23: సదరన్ డిస్కంలోని తిరుపతి సర్కిల్‌లో 76 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈఈలు 28, ఏడీఈలు 58 మందిని బదిలీ చేస్తూ సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు ఇచ్చారు. చేశారు. తిరుపతి సర్కిల్ పరిధిలో ఈఈల బదిలీల్లో భాగంగా తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న చంద్రశేఖర్ తిరుపతి టౌన్ డివిజన్ ఈఈగా.. ఆ స్థానంలో ఉన్న కె.వాసుదేవ రెడ్డిని చిత్తూరు ఎం ఎండ్‌పీకి బదిలీ చేశారు. తిరుపతిరూరల్ డివిజన్ ఈఈ మినహా మిగిలిన వారిని కూడా బదిలీ చేశారు. డీఈ ఈఈలను అధికారపార్టీ ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బదిలీలు చేసినట్లు తెలిసింది.

దేవదాయ నూతన ఏసీ బాధ్యతల స్వీకరణ



చిట్టెమ్మ దంపతులను ఆశీర్వదిస్తున్న కోదండరామాలయ ఈవో, అర్చకుడు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 23: జిల్లా దేవదాయశాఖ నూతన అసిస్టెంట్ కమిషనరు (ఏసీ)గా కె.చిట్టెమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకున్న ఏసీ ప్రసన్నలక్ష్మి సూళ్లూరుపేటకు బదిలీ అయ్యారు. చిట్టెమ్మ సత్యసాయి జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవోగా విధుల నిర్వహిస్తూ ఆదివారం ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో చిత్తూరు జిల్లాకొచ్చారు. ఈమెను కోదండరామాలయ ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకుడు వేణుగోపాల్ ఆశీర్వదించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను చిట్టెమ్మ మర్యాద పూర్వకంగా కలిసి అక్టోబరు మూడో తేదీనుంచి కోదండరామాలయంలో నిర్వహించే వార్షిక పవిత్రోత్సవాలు, దశావతార దసరా ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఈవోలు తిమ్మారెడ్డి, కమలాకర్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.57 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 82,436 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,437 మంది తలనీలాలు సమర్పించారు.

చర్యలు నిలిపివేస్తూ ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23: స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ చిత్తూరు అర్బన్ (ఆర్వో) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో అవినీతి నిరోధకశాఖ ఆకస్మిక తనిఖీ చేస్తూ నమోదు చేసిన కేసులో 10మందిపై తదుపరి శాఖాపరమైన చర్యలను నిలిపివేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2018 నవంబరు 12న చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి నిరోధకశాఖ దాడి చేసింది. ఈ క్రమంలో అప్పటి సబ్‌రిజిస్ట్రార్‌తోపాటు కిందిస్థాయి సిబ్బందిసహా 10మందిపై ఏసీబీ అధికారులు కేసు నమోదుచేశారు. దీనిపై శాఖాపరమైన విచారణ జరిగింది. 10మందిపై నమోదు చేసిన అభియోగాలు నిరూపితం కాకపోవడంతో వారిపై తదుపరి చర్యలను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ఆ ఉత్తర్వులో పేర్కొంది.

టీటీడీ పరిరక్షణ కోసం..

- 27న పుంగనూరు నుంచి తిరుమలకు పాదయాత్ర
- బీసీవై అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్

పుంగనూరు, సెప్టెంబరు 23: టీటీడీ పరిరక్షణ కోసం ఈనెల 27వ తేదీన పుంగనూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేయనున్నట్లు బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏడు డిమాండ్లతో పుంగనూరు నుంచి చౌడేపల్లె, సోమల, సదుం, కల్లూరు, పులిచెర్ల, రొంపిచెర్లక్రాస్, శ్రీనివాస మంగాపురం, అలిపిరి నుంచి తిరుమలకు మెట్లోత్సవం చేస్తూ పాదయాత్రగా వెళతామని ఆయన పేర్కొన్నారు.

ఏడు డిమాండ్లు ఇలా..

● తిరుమలలో జరిగిన అపచారాలు, అవినీతి అక్రమాలపై వంద రోజుల్లో విచారణ చేసి నిందితులను శిక్షించాలి. ● పాలక మండలి, పరిపాలన వరకు ప్రక్షాళన చేయాలి. పాలక మండలిలో రాజకీయ, కార్పొరేట్ శక్తులకు చోటు కల్పించరాదు. ● వీఐపీ బ్రేకు దర్శనాలు రద్దు చేసి.. సామాన్య భక్తులతోపాటు అందరికీ ఒకే దర్శనం ఏర్పాటు చేయాలి. ● టీడీపీలో అన్యమత ఉద్యోగులు తొలగించాలి, కొండపై వేయి కాళ్ల మండపానికి వేరొక చోట వెంటనే నిర్మించాలి. ● తిరుపతిలోని గోవిందరాజుస్వామి, కపిలతీర్థం, తిరుచానూరు అమ్మవారి ఆలయాలకు రెండు కిలోమీటర్ల దూరం వరకు మాంసం, మద్యం దుకాణాలు తొలగించాలి. ● తిరుమల ఆదాయాన్ని ప్రతి మూడు నెలకోసారి ఆడిట్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ● తిరుమలలోనే డెయిరీ ఏర్పాటు చేసి నెయ్యి తయారు చేయాలి.

డబుల్ డెక్కర్ ఫర్ సేల్

● సెకండ్ హ్యాండ్‌లో అమ్మేస్తాం కొనుక్కోండి ప్లీజ్

● బస్సును వదిలించేందుకు కార్పొరేషన్ బేరసారాలు



తిరుపతి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ నేతలు కార్పొరేషన్ నిధులతో వెచ్చించి ఆర్భాటాల కోసం తీసుకొచ్చిన డబుల్ డెక్కర్ బస్సును అమ్ముకునేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఎంతోకొంతకు అమ్మేస్తాం.. ప్లీజ్ అంటూ బేరసారాలు నడుపుతున్నారు. అయితే సెకండ్ హ్యాండ్‌లో అమ్ముతామన్న కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గార్బేజ్ షెడ్డులో పడున్న బస్సును వదిలించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపు రూ2.5 కోట్ల ప్రజాధనం పోసి కొన్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు చెత్తకుప్పల్లో దొరికే పాత బొమ్మలా మారిపోవడాన్ని సోమవారం కమిషనర్ ఎన్.మౌర్య దృష్టికి మీడియా ప్రతినిధులు తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆమె వైజాగ్ మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తమదగ్గర డబుల్ డెక్కర్ బస్సు ఉందని ఏదోఒక ధరకు ఇచ్చేస్తామని చెప్పారు. డబుల్ డెక్కర్ పైన వైజాగ్‌లాంటి నగరపాలక సంస్థ కూడా అంగీకరించకపోవడంతో 'మీరే ఏదైనా మార్గం చెప్పండి' అని మీడియా ప్రతినిధులనే అడిగారు. ఇటీవల జూపార్కుకు మినీ డబుల్ డెక్కర్ బస్సును కొనుగోలు చేశారని, అక్కడ ప్రయత్నం చేయమని చెప్పడంతో విచారించమని అధికారులను ఆదేశించారు.

నాడు గొప్పలు.. నేడు తిప్పలు

దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతికి డబుల్ డెక్కర్ బస్సు తీసుకొచ్చామని వైసీపీ స్థానిక నేతలు గొప్పలు చెప్పారు. అక్కరకు రాక దానిని అమ్ముకునేందుకు ఇప్పుడు అధికారులు తిప్పలు పడుతున్నారు. మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి గత ఏడాది ఆగస్టు 8న జరిగిన కౌన్సిల్లో ప్రతిపాదించి రూ2.30కోట్ల కార్పొరేషన్ సాధారణ నిధులనుంచి డబుల్ డెక్కర్ బస్సు కొనుగోలు చేయించారు. తొలుత బస్సును ఆర్టీసీకి అప్పగించి అద్దె వసూలు చేయాలనుకున్నారు. ఈ తరహా బస్సుల నిర్వహణకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో వారు నిరాకరించారు. చివరకు కార్పొరేషన్ భుజాలకెత్తుకుంది. ఇరుకురోడ్లలో బస్సు రాకపోకలకు కష్టతరంగా మారడంతో రాత్రికిరాత్రే రెండువేలకు పైగా చెట్ల కొమ్మలను నేలకూల్చి, నిలువ నీడ లేకుండా చేశారు. గత ఏడాది అక్టోబరు 12న బస్సును రోడ్డుపైకి తీసుకొచ్చారు. ఎక్కడ ఎక్కి దిగినా రూ.50 బస్సు ఛార్జీని నిర్ణయించారు. రోజుకు పది మందికూడా ఎక్కకపోవడంతో కొంతకాలం ఉచితంగా తిప్పారు. బస్సుకు ఆర్టీసీ నుంచి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. కానీ దర్జాగా రోడ్లపై తిరిగేసింది. చట్టరీత్యా నేరం కావడంతో కార్పొరేషన్ అధికారులకు రవాణాశాఖ అధికారులు లేఖ రాశారు. బస్సు సీజ్ చేయాల్సివస్తుందని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో వినాయక సాగర్ వద్దగల గార్బేజ్ షెడ్డులో బస్సును పార్కు చేసి పెట్టేశారు.

హంద్రీ-నీవాతో సాగు, తాగునీరిస్తాం

●కురబలకోటలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ● మదనపల్లెలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నేతృత్వంలో మంత్రికి టీడీపీ శ్రేణుల ఘన స్వాగతం


కురబలకోటలో హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు


మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా టీడీపీ నాయకులు


ములకలచెరువులో మంత్రిని కలిసిన టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు


బి.కొత్తకోటలో మంత్రి రామానాయుడుకు సమస్యలు వివరిస్తున్న టీడీపీ నేతలు

కురబలకోట, సెప్టెంబరు 23: హంద్రీ-నీవా జలాలతో పంట పొలాలకు సాగు, ప్రజలకు తాగునీటిని అందివ్వడమే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దొమ్మన్నబావి సమీపంలో హంద్రీ-నీవా కాలువను మంత్రి పరిశీలించి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తాగు, సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపుగా హంద్రీ-నీవాను పూర్తి చేసి నీటిని సరఫరా చేశామని, వచ్చే సీజన్‌కు పూర్తి నీటిని అందించి రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి పనులకు సంబంధించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌భాషా, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘా స్వరూప్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, గుత్తికొండ త్యాగరాజు. పర్వీన్‌తాజ్, ఖలీల్, రాఘవరెడ్డి, అయూబ్‌బాషా, పాల్గొన్నారు.

చిప్పిలిని ముంపు నుంచి కాపాడండి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23: హంద్రీ-నీవా ప్రాజెక్టు పనుల సందర్శనకు వచ్చిన రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును చిప్పిలి గ్రామస్థులు కలిసి వరద ముంపు నుంచి గ్రామాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా చిప్పిలి గ్రామస్థులు మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణంతో తమ గ్రామం ముంపునకు గురవుతోందని, దీనికి గ్రామంలోకి నీరు రాకుండా రక్షణ కట్ట నిర్మించారని కాని చిప్పిలి గ్రామానికి ఎగువన గుట్ట, ప్రాంతాల్లో వర్షం పడితే ఈ వర్షపు నీరంతా ఎస్ఎస్ ట్యాంకులోకి, ట్యాంకు కిందికి వెళ్లేందుకు మార్గం లేకుండా పోయి నీరంతా తమ గ్రామంలోని ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. ఈవిషయమై మంత్రి సమీక్షించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను మంత్రి ఆదేశించారు. కాగా అంతకు ముందు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా నేతృత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి రామానాయుడుకు ఘన స్వాగతం పలికారు. సోమవారం స్థానిక చిప్పిలి గ్రామం వద్ద మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆత్మీయంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ఏ మస్తాన్, మార్పుని గాంధి, నాదెళ్ల శివన్న, మార్పురి వరుణ్, నిరంజన్‌నాని, సంగం హరి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా జలాలను బాహుదాకు అనుసంధానించాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 23: మండలంలోని బాహుదా ప్రాక్టుకు హంద్రీ-నీవా జలాలను అనుసంధానం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మలరామానాయుడుకు టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, రాజంపేట టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు లక్ష్మన్న వినతి పత్రం ద్వారా విన్నవించారు. సోమవారం మదనపల్లి సమీపంలోని చిప్పిలి సమ్మర్ స్టోరేజ్‌ను పరిశీలించేందుకు వచ్చిన మంత్రికి మండల పరిస్థితుల గురించి వివరించారు. వారు మాట్లాడుతూ బాహుదా ప్రాజక్టు పూర్తి స్థాయిలో నిండితే దాదాపు 3వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. రైతులు కేవలం వర్షాన్ని నమ్ముకొని పంటలను వేసి జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. హంద్రీ-నీవా జలాలను బాహుదాకు అనుసంధానం చేస్తే నిమ్మనపల్లితో పాటు వాల్మీకిపురం, పీలేరు మండలాలకు తాగు, సాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. స్పదించిన మంత్రి ఖచ్చితంగా హంద్రీ-నీవా జలాలను బాహుదాకు అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు విజయ్, చినబాబు, చెంద్రాయుడు, గోపాలక్రిష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నేతలు

ములకలచెరువు, సెప్టెంబరు 23: బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌లో సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడిని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేతలు కలిశారు. టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధా, బిల్డర్ రమణ, ఆనందరెడ్డి, నారాయణస్వామిరెడ్డి, బంగారు వెంకటరమణ, నేతలు కుడుం శ్రీనివాసులు, వైజీ రమణ, చెన్నకిష్టా, కేశవులు, ముత్తకూరు మౌళా, జేసీబీ సుధాకర్‌నాయుడు, రామకృష్ణమరాజు, సోము, ఉమా తదితరులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సమస్యలపై నాయకుల ఏకరువు

బి.కొత్తకోట, సెప్టెంబరు 23: రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, తంబళ్లపల్లె నియోజకవర్గ నాయకుడు జయచంద్రారెడ్డి, పోల్‌మేనేజ్మెంట్ కన్వీనర్ కుడుం శ్రీనివాసులు తదితరులు హిల్స్ కు చేరుకొని సమస్యలు విన్నవించారు. నియోజకవర్గ సమస్యలు, హంద్రీ-నీవా కాలువ ద్వారా చేపట్టాల్సిన పనులు, నింపాల్సిన స్థానిక చెరువుల గురించి మంత్రికి వివరించారు. ముదివేడు రిజర్వాయర్ కోసం తాము వ్యవసాయ భూములు కోల్పోయామని, తమకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజి అమలు చేయాలని మండలంలోని చౌటకుంటపల్లి గ్రామస్థులు మంత్రికి వినతి పత్రంతో విన్నవించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి మంత్రి మదనపల్లె పర్యటనకు బయలుదేరి వెళ్లిపోయారు. మొదటిసారి అన్నమయ్య జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి ఆదివారం అనంతపురం, సత్యసాయి జిల్లాల పర్యటన ముగించుకొని రాత్రి 12 గంటలకు బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్స్‌లీహిల్స్ కు చేరుకున్నారు. అధికారులు ప్రోటోకాల్ మేరకు గవర్నర్ బంగ్లాలో విడిది ఏర్పాట్లు చేశారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి


నరేష్ (ఫైల్ ఫొటో)

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23: మదనపల్లె మండలం పుంగనూరు జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం జగిరిన రోడ్డుప్రమాదంలో నరేష్ (28)అనే యువకుడు దుర్మరణం చెందాడు.. ద్విచక్రవాహనంపై వచ్చి పుంగనూరు రోడ్డులో టీ తాగుతున్న యువకుడిని పుంగనూరు నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో అతను అక్కడికి అక్కడే మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు మృతుడు పుంగనూరు మండలం, నేటిగట్లపల్లె గ్రామం, కురవూరుకు చెందిన నరేష్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పంచనామా కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికి తరలించారు. తాలుకా సీఐ కళావెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ముగ్గురికి గాయాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు23: విద్యుత్ షాక్‌తో ముగ్గురికి గాయాలై సోమవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కుటుంసభ్యులు వివరాల మేరకు మదనపల్లె పట్టణం, అనపగుట్టకు చెందిన నాగరాజ(65),కోడలు ప్రమీల (35), మనువడు ప్రశాంత్(13) మిద్దిపైన బట్టలు ఆరవేసే కమ్మికి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌కు గురైనట్లు పేర్కొన్నారు. గాయపడిన బాధితులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆస్పత్రికి అని వచ్చి .. అనాథలా మారిన వృద్ధురాలు


అనాథగా పడి ఉన్న వృద్ధురాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు23: బెంగళూరు నుంచి ఆస్పత్రికి అని వచ్చి ఓ వృద్ధురాలు అనాథలా మారింది. మూడు రోజులు గా స్థానిక ఓ ప్రైవేటు కంటి ఆస్పత్రి సమీపంలో అనాథలా పడిఉన్న వృద్ధురాలును సోమ వారం స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తర లించారు. వివరాలు అడిగితే మాది బెంగళూరుఅని, తన భర్త రామస్వామి అని, ఆస్పత్రికి అని వచ్చామని చెబుతుంది. వేరే వివరాలు ఏమి చెప్పలేకపోతేంది. స్థానికులు ఆస్పత్రికి తరలిం చడంతో వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు.

మదనపల్లె డివిజన్ మైనింగ్‌శాఖ అధికారుల బదిలీలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23: మదనపల్లె డివిజన్ మైనింగ్ శాఖలో అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర భూగర్భ, జలవనరులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ముఖేష్‌కుమార్ మీనా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె డివిజనల్ ఎంజీవోగా దాచేపల్లెలో పనిచేస్తున్న డి. వెంకటరాఘవ కుమార్‌ను బదిలీ చేశారు. అలాగే ఇక్కడ డివిజనల్ ఎంజీవోగా పనిచేస్తున్న రాజశేఖర్‌ను కర్నూల్‌కు బదిలీ చేశారు. మదనపల్లె అసిస్టెంట్ డీఎం జీవోగా అనంతపురంలో పనిచేస్తున్న హెచ్ఎం. శివప్రసాద్‌ను బదిలీ చేశారు. దీంతో పాటు మదనపల్లెలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కవితను తాడిపత్రికి బదిలీ చేయగా, దాచేపల్లెలో ఆర్ఐగా పనిచేస్తున్న విజయకుమారిని మదనపల్లె రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

గ్యారంపల్లె అధ్యాపకుల వరద సాయం


మంత్రి నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న గ్యారంపల్లె అధ్యాపకులు

పీలేరు, సెప్టెంబరు 23: విజయవాడలోని వరద బాధితుల కోసం కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని గురుకుల జూనియర్ కళాశాల అధ్యాపకులు రూ.50 వేలు వితరణగా అందజేశారు. గత వారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యెంలో జరిగిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటనలో ఆయనను కలిసి ఈ మేరకు చెక్కు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. చెక్కు అందజేయడంతోపాటు నాబార్డు నిధులు రాక తమ కళాశాలలో పెండింగ్‌లో ఉన్న పలు పనులు పూర్తి చేయాలని తాము మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ రమాదేవి, లక్ష్మీపతి నాయుడు, డా.రామకృష్ణ, ఆంజనేయులు, శివమూర్తి, శేఖర్ పాల్గొన్నారు.

పీలేరు ఆసుపత్రికి వీల్ చైర్స్ వితరణ


వితరణగా అందిన వీల్‌చైర్స్‌తో పీలేరు ఆసుపత్రి సిబ్బంది

పీలేరు, సెప్టెంబరు 23: పీలేరు మండలం జాండ్ల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పల్లం జయప్రకాశ్, కొప్పు నాగరాణి రెండు వీల్ చైర్లను వితరణగా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి అందించారు. తమ తాత, అవ్వలైన పల్లం గంగయ్య, పల్లం లక్ష్మమ్మల 5వ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం ఆసుపత్రికి వీల్ చైర్లు అందించినట్లు వారు తెలిపారు. ఈ మేరకు వారు వాటిని సోమవారం ఆసుపత్రికి అందించారు. వారి సేవా నిరతిని ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అభినందించారు.

కరాటే పోటీల్లో పీలేరు విద్యార్థుల ప్రతిభ

పీలేరు, సెప్టెంబరు 23: కర్నూలులో ఆదివారం జరిగిన 6వ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పీలేరుకు చెందిన యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే మాస్టర్ ఇనాముల్ హక్ తెలిపారు. తమ అకాడమీకి చెందిన విద్యార్థులు బెస్ట్ టీం ఛాంపియన్‌షిప్ ట్రోఫీతోపాటు వికాశ్, రహీల్ ఆఫ్రిద్, కన్విక, అస్వాన్, గగన్, దిశాంత్ అనే విద్యార్థులు వివిధ విభాగాల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ఆయన తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కలకడ, సెప్టెంబరు 23: గ్రామల్లోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని డీపీఎంవో రియాజ్‌బేగ్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన మండలంలోని గుడిబండ హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించి మందులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ప్రసుత్తం వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువు ఎంపీడీవో బదిలీ

ములకలచెరువు, సెప్టెంబరు 23: ములకలచెరువు ఎంపీడీవో పోలప్పను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ను శ్రీ సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. దీంతో ఆయన స్థానంలో కార్యాలయ ఏవో ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు.

ఆఫీసర్స్ క్లబ్‌లో ఆంక్షలు తగవు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు23: మదనపల్లె ఆఫీసర్స్ క్లబ్‌లో ఆంక్షలు విధించడం తగదని రిటైర్డ్ ఏఎస్పీ బోయపాటి సుబాష్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో అందరూ కాసేపు హాయిగా చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి ఆటలు ఆడి ఆరోగ్యంగా ఉండేవారమని, గత ఐదేళ్లుగా ఆంక్షలు విధించడంతో ఇంటివద్ద ఉంటూ చాలా మంది వివిధ రకాల మానసిక రుగ్మతల భారినపడుతున్నారని ఆరోపించారు. తమ ఆఫీసర్స్‌క్లబ్‌లో అందరూ రిటైర్డ్ ఉద్యోగులేనని, దీనికి అధ్యక్షుడుగా సబ్‌కలెక్టర్, కార్యదర్శిగా డీఎస్పీ ఉంటారని తెలిపారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం

రామసముద్రం, సెప్టెంబరు 23: మండలంలో ప్రతి మంగళ, బుధవారాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని ఏవో మోహన్‌కుమార్ తెలియజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖలైన పశువైద్య, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు రెండు రైతు సేవా కేంద్రాలలో పొలాలను సందర్శించి రైతులకు సలహాలు ఇస్తారన్నారు.

కల్తీ నెయ్యి సరఫరా చేసిన వారిని శిక్షించాలి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

కురబలకోట, సెప్టెంబరు 23: పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల వేంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యిని సరఫరా చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం మండలంలోని అంగళ్ళలో సీఐ రమేష్, ఎస్ఐ దిలీప్‌కుమార్‌లకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ప్రీతి పాత్రమైన లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వును సరఫరా చేయడం హిందూ మతానికి అవహేళన చేయడమేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, శంకర్‌రెడ్డి, బీజేపీ నేతలు బావాజాన్, రాజారెడ్డి, నరసింహులు, చిన్నప్ప, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి


అనాథాశ్రమంలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకుడు ఎస్ఏ మస్తాన్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23: ప్రతి ఒక్కరు పేద విద్యార్థులను అన్ని విధాల ఆదుకోవాలని టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ పేర్కొన్నారు. ఎస్ఏ మస్తాన్ సతీమణి నస్రీన్‌తాజ్ జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలోని చైతన్య అనాథాశ్రమం, కూరపర్తి చైతన్య అనాథాశ్రమం, ధాత్రి ఫౌండేషన్ ఆశ్రమాల్లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యుల పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏటా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమాల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరాడంబరంగా అప్పినిపల్లె జన్మదిన వేడుకలు


అప్పినిపల్లె భాస్కరాచారిని సన్మానిస్తున్న సేవా సంస్థ సభ్యులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23: చైతన్య సేవా సంస్థలో అప్పినపల్లె జన్మదిన వేడుకలు నిరాడంబరంగా అనాథపిల్లల మధ్య సోమవారం ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద కృష్ణచరణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మరసం ప్రధాన కార్యదర్శి యుగంధర్ ఆచారి, చైతన్య సంస్థ వ్యవస్థాపకుడు ఎంపీ ఆనందన్, స్కూల్ ప్రిన్సిపాల్ కవితారాణి లతో కలిసి పిల్లలకు, వృద్ధులకు స్వీట్స్ పంపిణీ చేశారు. అలాగే భోజనా లను. ఆహారపదార్థలను తీసుకెళ్లడానికి పెద్ద స్టీల్ కారియర్లను వితర ణగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ జోనల్ ఛైర్మన్, ఏబీసీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారిని సంస్థ తరుపున అప్పినపల్లెకు దుశ్శాలువ కప్పి జ్ఞాపికతో సన్మానించారు. మదనపల్లె సర్వబోధన ఆస్పత్రిలో రోగులకు, సొసైటీ కాలనీ పార్కు వద్ద పారిశుధ్య కార్మికులకు మదనపల్లె లయన్స్‌క్లబ్‌లో వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గొప్ప సైద్ధాంతిక వేత్త సీతారాం ఏచూరి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు23: గొప్ప సైద్ధాంతిక వేత్త సీతారం ఏచూరి అని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో సీపీఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కోసం, అహర్నిశలు పోరాడిన వ్యక్తి మరణం బాధాకరమన్నారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, సీపీఎం నాయకుడు హరిశర్మ, టీడీపీ నాయకులు సిద్ధప్ప, నీలకంఠ, విద్యాసాగర్, కమలామరికృష్ణ, నాగూర్‌వలి, షంషీర్, గోపాల్‌రెడ్డి, గిరిష్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

వాల్మీకిపురం, సెప్టెంబరు 23: రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. సోమవారం వాల్మీకిపురం వ్యాప్తంగా ఇంటింటా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాలలో సర్పంచ్ మహిత, నాయకులు ద్వారకనాథరెడ్డి, శేషాద్రిరెడ్డి, రమేష్, పీవీ నారాయణ, చంద్రమౌళి, షబ్బీరుల్లాఖాన్, జావీద్, ఆదినారాయణ, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

●పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ, సెప్టెంబరు 23:రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, మురికి కాలువలు, ఇతర సంక్షేమ పథకాలను ప్రభుత్వం దశవారీగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ఈ సందర్భంగా తలారివాండ్లపల్లెలో సింగిల్ పేస్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నెలలు గడుస్తున్న ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, మూర్తిరావు, ప్రసాద్‌నాయుడు, నౌషాద్ అహ్మద్, చలమారెడ్డి, ప్రదీప్‌చంద్, మురళీ, చంద్రబాబు, నాగేంద్రరెడ్డి, ఇక్బాల్‌ఖాసీం, జయసూరి, బయ్యారెడ్డి, బాబాజాన్, పర్వేజ్, రామయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషిచేస్తున్న ప్రభుత్వం


ఆరోగ్యవరం వద్ద ఇది మంచి ప్రభుత్వం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజుల్లోనే ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తూ ఇది మంచి ప్రభుత్వంగా గుర్తింపు పొందుతోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోతబోలు పంచాయతీ ఆరోగ్యవరం వద్ద ఇది మంచి ప్రభుత్వం బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను రూ.4వేలకు పెంచడం, ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేయడం, రూ.5కే అన్న క్యాంటీన్‌లో భోజనం అందించడం, ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టి కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతోందన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు తన అనుభవాన్ని అంతా జోడించి అప్పులపాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడుపుతున్నారన్నారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, తహసీల్దార్ ఖాజాబీ, టీడీపీ నాయకులు విద్యాసాగర్, జీకే వెంకటరమణ, బాలుస్వామి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రంలో : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అయిన సందర్భంగా సోమవారం మండలంలోని కాట్నగల్లు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ నేత జయచంద్రారెడ్డి నిర్వహించారు. గ్రామంలోని అధికారులతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన పనులు, అమలు చేసిన పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కాట్లగల్లు గ్రామం లో కొన్న సమస్యలను జయచంద్రారెడ్డి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెద్దమండెంలో: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీవో శీధర్‌రావు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇది మన ప్రభుత్వం.. మంచి ప్రభుత్వం ద్వారా పేద ప్రజలకు ఖచ్చితంగా పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రామకృష్ణ, కూటమి నేతలు గంగాధర, నాగూరు, మహేశ్వరి, జరీనా, మస్తాన్ సుబ్బయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

కురబలకోటలో: టీడీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం సాధ్యమవుతుందని ఆ పార్టీ నేతలు అయూబ్‌బాషా, వైజీరమణలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముదివేడులో గ్రామ సచివాలయంలో 100రోజులు పూర్తైన తరుణంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హబీబ్, మోహన్‌రెడ్డి, మారపరెడ్డి, చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులుఅయిన సందర్భంగా సోమవారం తంబళ్లపల్లె మండబలంలోని గుండ్లపల్లెలో యూనిట్ ఇన్‌చార్జి కాలా నారాయణ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, అధికారులు ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ నాయుడు, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఈవోపీఆర్డీ దిలీఫ్‌కుమార్, సిద్దమల్‌రెడ్డి, బాలినేని లక్ష్మీనారాయణ, అశోక్ నాయుడు, రెడ్డెప్ప నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల పరిరక్షణకు కార్యాచరణ

కలికిరి, సెప్టెంబర్రు 23: మండలంలో వివిధ దేవాలయాల భూములను వెంటనే గుర్తించి వాటి పరిరక్షణకు కార్యాచరణ చేపట్టాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలస్థాయి అధికారులతో సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహస్వామి ఆలయానికి సంబంధించిన విలువైన భూములు ఆక్రమణలో ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వెంటనే భూములను గుర్తించాలని తహసీల్దారు మహేశ్వరీ బాయిని ఆదేశించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద రూ.కోట్ల విలువ చేసే స్వామి వారి భూమి అన్యాక్రాంతం కావడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లవోలు పంచాయతీ గడి చెరువులో ఇళ్ల స్థలాల పేరుతో వెంచరు వేసి అమ్ముకున్నారని ఎంపీటీసీ రమణప్రదీప్ రెడ్డి ఫిర్యాదు చేశారు. వెంటనే చెరువు ఆక్రమణలను గుర్తించి కంచె ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మర్రికుంటపల్లె గ్రామంలో స్టేట్ హైవే పక్కనే రస్తా పొరంబోకును ఇళ్ల స్థలాల వెంచర్ లో కలిపేసి ప్లాట్లు వేసి అమ్ముతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని ఆ గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఒక రోజు గడువులోగా రస్తా పొరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. సీఎల్ఆర్సీ, కొత్తపల్లె కాలనీల్లో ఎన్ని స్థలాలు ఉన్నాయి, నిజమైన పట్టాలెన్ని, ఫోర్జరీ పట్టాలెన్ని, ఆక్రమించిన స్థలాలు ఎన్ని అని సమగ్ర వివరాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

చౌకదుకాణాలలో సరుకుల అక్రమాలను అరికట్టండి


సబ్‌కలెక్టరేట్ డీఏవో పద్మావతికి వినతిపత్రాలు అందిస్తున్న ప్రజలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23: మదనపల్లె అర్బన్, మండలంలో ప్రజలకు ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువుల పంపిణీలో అక్రమాలను అరికట్టాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో పద్మావతి ఆధ్వర్యం లో గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న చక్కెరను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, గాంధీపురం, కుమారపురం ప్రాంత ప్రజలకు చౌకదుకాణం అందుబాటులో లేదని పునీత్ పేర్కొన్నారు. సివిల్ సప్లైస్ అమలులో పర్యవేక్షణ కొరవడిందన్నారు. కురబలకోట మండలం కంటేవా రిపల్లె వద్ద తమ భూములను ఓ పోలీసు అధికారి స్వాధీనం చేసుకున్నాడని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని రైతు వెంకటశిద్దులు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలో సంఘమిత్ర బినామి పేర్లతో రుణాలు తీసుకుని, ప్రభుత్వం సొమ్ముల కాజేస్తోందని గ్రూపు లీడరు శోభావతి ఫిర్యాదు చేశారు. పట్టణం లోని 35వ వార్డులో మున్సిపల్ కుళాయిల్లో తాగునీటి బదులు మురికినీరు సరఫరా అవుతోందని ఈ వార్డు ప్రజలు ఫిర్యాదు చేశారు. మొత్తం 28 మంది అర్జీదారులు అందించారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం మోగా జాబ్‌మేళా

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ కల్పించడానికే మోగా జాబ్‌మేళాను నిర్వహించినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక జ్ఞానాభింక డిగ్రీ కళాశాల్లో కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, కో- ఆర్డినేటర్ జయంతి, ఎం.వెంకటేష్, ట్రైనర్ కళా సహకారంతో 42 ఐటీ కంపెనీ హెచ్ఆర్‌లు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన సూమారు 4 వేలు మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ మదనపల్లె ఐటీ కంపెనీలు తేవడానికి కృషి చేస్తానన్నారు. ఇలాంటి జాబ్ మేళాలను ఏర్పాటు చేసి నిరుద్యోగత తగ్గించడానికి కృషి చేస్తాన్నారు. జ్ఞానాంబిక కళాశాల రాటకొండ గురుప్రసాద్, కంపెనీలు మదనపల్లెకు తేవడానికి శ్రమించిన జయంతిని, వెంటేష్‌ను, ట్రైనర్ కళాను ఎమ్మెల్యే దుశ్శాలువలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికి మెరుగైన వైద్యసేవలు

తంబళ్లపల్లె సెప్టెంబర్ 23 : అందరికి మెరుగైన వైద్య సేవలు అందించడం కోసమే మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా హీ- సేవ కార్యక్రమంలో భాగంగా మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మెడికల్ క్యాంపుతో అన్ని వ్యాధులకు పరీక్షలు చేసుకుని వైద్యం పొందవచ్చన్నారు. దీంతో పాటు శానిటరీ వర్కర్లు 28 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఈవోపీఆర్డీ దిలీఫ్‌కుమార్, ఏవో ఆనంద్‌కుమార్, టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి సిద్దమ్మ, ఉత్తమరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.